PRGI Reg No -“APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 109, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, మంగళవారం - 09 - జూన్ - 2026 , వెల రూ.5/-

# గొడ్డలి పార్టీకి రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత లేదు

## పరీక్షలంటే తెలియని వారు కూడా బురద జల్లుతున్నారు

- ★పశ్చిమగోదావరి జిల్లాలో ‘మీ భూమి - మీ హక్కు’ కార్యక్రమం
- ★ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో భూములు కాజేసే ప్రయత్నం జరిగిందని ఆరోపణ
- ★భద్రతా ఫీచర్లతో రాజముద్ర వేసి కొత్త పాస్‌బుక్కులు ఇస్తున్నామని వెల్లడి
- ★రికార్డులు ఫోర్జరీ చేసిన ఎమ్మెల్యేపై వైసీపీ ఎందుకు చర్యలు తీసుకోలేదు? అంటూ ప్రశ్న



అమరావతి: పరీక్షలు అంటే ఏమిటో, రిజర్వేషన్లు అంటే ఏమిటో తెలియని వ్యక్తులు డీఎస్సీ నియామకాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం సిద్ధాంతంలో నిర్వహించిన ‘మీ భూమి - మీ హక్కు’ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేశారని, తాము అధికారంలోకి వచ్చాక దాదాపు మిగతా 2 లో



## ఏపీలో రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటును పరిశీలించండి

- ●ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ ఏర్పాటుకు చొరవ చూపండి
- ●పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుంచి అరుదైన లోహాలు వెలికితీసేందుకు, సాంకేతికతను అందించడంలో భాగస్వాములు కావాలి
- ●25 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఈ మ్యూజియం ఏర్పాటైంది.

అమరావతి: రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాకుళంలో ఉన్న ఖనిజ వనరుల ఆధారంగా డీప్ ప్రాసెసింగ్, రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్



## ధవళేశ్వరం బ్యారేజీకి మహర్దశ.. రూ.124 కోట్లతో ఆధునికీకరణ పనులు!

- ●46 ఏళ్ల తర్వాత ధవళేశ్వరం బ్యారేజీకి పూర్తి స్థాయిలో అప్‌గ్రేడేషన్
- ●తుప్పు పట్టిన 117 గేట్ల స్థానంలో కొత్త గేట్ల ఏర్పాటు
- ●రెండేళ్లలో పనులు పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం

## 27,000 పాఠశాలలను 4,000గా మార్చడం దారుణం



- ▶స్కూళ్ల కుదింపు.. రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర విమర్శలు
- ▶తెలంగాణలో స్కూళ్ల కుదింపుపై మొదలైన రాజకీయ దుమారం

# ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులివ్వండి

## అధికారులకు పవన్ ఆదేశం

- ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు
- రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు
- నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలింది



అమరావతి: గోదావరిలో కాలుష్యానికి కారణమవుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు మిగతా 2 లో




కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి కేసులో సుప్రీం తీర్పు

- పెళ్లికి ముందు మేజర్లు ఇష్టపూర్వకంగా సంబంధం పెట్టుకుంటే తప్పుకాదన్న కోర్టు
- మారుతున్న కాలంలో ఇది సాధారణమైందన్న అత్యున్నత న్యాయస్థానం
- దీని ఆధారంగా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమన్న కోర్టు
- ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆదేశం

ఢిల్లీ: ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే.. దాని ఆధారంగా వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని

## రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసింది

### తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను ప్రభుత్వమే చెల్లిస్తుందని వ్యాఖ్య

- ▶▶నవభారత నిర్మాణంలో బొగ్గు రంగానిదే కీలక పాత్ర
- ▶▶కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా బొగ్గు ఉండేది



హైదరాబాద్: నవభారత నిర్మాణంలో బొగ్గు రంగం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ, గత యూపీఏ ప్రభుత్వంపై మిగతా 2 లో

## రాష్ట్రానికి పెట్టుబడులు పెరుగుతున్నాయి

- ▶రూ.20 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తున్నాయి
- ▶22 లక్షల మందికి ఉద్యోగాలు వస్తున్నాయి
- ▶బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా భూములను సర్వే చేశాం



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ‘ఇండియా’ కూటమి డిమాండ్..




ఢిల్లీ: నీట్, సీబీఎస్ఈ పరీక్షల వివాదాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ‘ఇండియా’ కూటమి నేతలు డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం ప్రతిపక్ష ‘ఇండియా’ కూటమి సమావేశం ముగిసిన అనంతరం మిగతా 2 లో



## డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ భూదందాలు.. సస్పెండ్ చేసిన ప్రభుత్వం!

- ●భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా తేలింది
- ● బీఆర్ఎస్ హయాంలో చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు.. కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు
- ●బహిరంగ మార్కెట్లో గజం సుమారు రూ.2లక్షల ధర ఉన్న హైకోర్టు గేట్ల వద్ద హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడింది

హైదరాబాద్: హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మిగతా 2 లో

# రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## జూన్ 15 తర్వాత తేలుస్తా.. బరాబర్ జవాబిస్తా

- ➤హైదరాబాద్ అభివృద్ధిని కేంద్ర మంత్రి అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు
- ➤మెట్రో, మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు పనులకు ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శ
- ➤ఉప్పల్ నియోజకవర్గంలో రూ.1600 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



హైదరాబాద్: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కిషన్ రెడ్డి అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. జూన్ 15వ తేదీ తర్వాత ఆయన సంగతి బరాబర్‌గా తేలుస్తానని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉప్పల్‌లో రూ.1600 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సభలో సీఎం వ్యాఖ్యలు చేశారు. “తెలంగాణ ప్రజలతో గోక్కున్నవాడు ఎవరూ బాగుపడలేదు” మిగతా 2 లో



## ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు చెందినవారేనన్న రేవంత్ రెడ్డి

### రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తప్పుబట్టిన శివసేన(యూబీటీ)

- ●దేశాన్ని విడదీయొద్దు.. రేవంత్ రెడ్డికి ‘ఇండీ’ మిత్రపక్షం హితవు!
- ●యుద్ధం వస్తే భారతీయులుగానే పోరాడతామని ఉద్బోధ
- ●ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకూడదని హితవు
- ●దక్షిణ భారత ప్రజలు రెండో శ్రేణి పౌరులుగా ఉండలేరని వ్యాఖ్య

## జులైలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం: పీయూష్ గోయల్

ఢిల్లీ: సుదీర్ఘకాలంగా చర్చల దశలో ఉన్న భారత్-అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుంది. వచ్చే జులైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరు దేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ.. చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తి స్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జులై మధ్య నాటికి ఇరు దేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలు చేసే స్థితికి చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారుల భేటీ తర్వాతే మళ్లీ ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు. అయినప్పటికీ, వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరు దేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. తఅమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో.. ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పిన టైమ్‌లైన్ ప్రకారం అన్నీ సజావుగా సాగితే.. జులై మధ్యకల్లా ఇరు దేశాల మధ్య సరికొత్త ఆర్థిక అధ్యాయం మొదలవుతుంది.

## ధవళేశ్వరం బ్యారేజీకి మహర్దశ.. రూ.124 కోట్లతో ఆధునికీకరణ పనులు!

గోదావరి: గోదావరి డెల్టా జిల్లాల జీవనాడి, చారిత్రాత్మక ధవళేశ్వరం బ్యారేజీ (సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ) ఆధునికీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బ్రిటీష్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఈ ఐకానిక్ నిర్మాణానికి దాదాపు 46 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు పూర్తి స్థాయిలో అప్‌గ్రేడ్ లభించబోతోంది. బ్యారేజీ భద్రతను పెంచడం, నీటి నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా గోదావరి డెల్టా పరిధిలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యం. ధవళేశ్వరం బ్యారేజీకి చివరిసారిగా 1980లో పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చేశారు. అయితే దశాబ్దాలు గడుస్తున్న కొద్దీ బ్యారేజీలోని పలు భాగాలు బలహీనపడ్డాయి. ముఖ్యంగా ఇందులోని 117 గేట్లు తీవ్రంగా తుప్పు పట్టిపోవడంతో, వాటి భద్రతపై నిపుణుల కమిటీలు తమ నివేదికల్లో పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో అలర్ట్ అయిన ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తలకెత్తుకుంది. ఈ ఆధునికీకరణ పనుల కోసం ప్రభుత్వం మొదట సుమారు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను ఆహ్వానించింది. చివరకు 'బేకమ్' (దీవష్మిఎ) కంపెనీ రూ.124.34 కోట్లకు ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా పాతబడిపోయిన, తుప్పు పట్టిన 117 గేట్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కొత్త గేట్లను అమర్చనున్నారు. ఈ ఆధునికీకరణ పనులన్నింటినీ రాబోయే రెండేళ్ల కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పనులు పూర్తయితే బ్యారేజీ నీటి నిల్వ, విడుదల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయ రంగానికి, దీర్ఘకాలిక నీటి అవసరాలకు ఈ ప్రాజెక్ట్ ఒక పెద్ద బూస్ట్‌లా నిలవనుంది. అవసరమైన అధికారిక ఫార్మాలిటీస్ ముగిసిన వెంటనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కానున్నాయి.

## ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు చెందినవారేనన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఓ కార్యక్రమంలో చేసిన 'ఉత్తర-దక్షిణ భారత' వ్యాఖ్యలపై 'ఇండీ' కూటమి మిత్రపక్షం శివసేన (యూబీటీ) తీవ్రంగా స్పందించింది. దేశాన్ని రాష్ట్రాల వారీగా ముక్కలు చేసేలా మాట్లాడటం ఏమాత్రం సరికాదని హితవు పలికింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రాంతీయ విభేదాల కంటే జాతీయ ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ వివాదంపై శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబె మాట్లాడుతూ.. "మన భారతదేశం ఓ అందమైన పూలగుచ్ఛం లాంటిది. అందులో ఒక్కో పువ్వు ఒక్కో రంగులో, ఒక్కో సువాసనతో ఉంటుంది. కానీ అవన్నీ కలిస్తేనే ఒక అందమైన గుచ్ఛం అవుతుంది" అని దూబె వ్యాఖ్యానించారు. భౌగోళిక, భాషా వ్యత్యాసాలతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికి సమాన గౌరవం దక్కాలని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం వస్తే మనం ఉత్తర భారతం, దక్షిణ భారతం అని చూసుకోమని దూబె వ్యాఖ్యానించారు. మనమందరం భారతీయులుగానే నిలబడతామని, రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. రేవంత్ కాంగ్రెస్ సీనియర్ నేత అయినప్పటికీ కూటమి భాగస్వామ్య పక్షంగా దేశ సమగ్రత విషయంలో తాము రాజీపడేది లేదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాబోవని ఆశిస్తున్నట్లు పేర్కొంది. ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రధాని, రాష్ట్రపతి ఇద్దరూ ఉత్తర భారత్‌కు చెందినవారేనని.. దక్షిణాదిని ప్రాతినిధ్యం వహించే బలం బీజేపీకి లేదని ఆరోపించారు. దక్షిణ భారతదేశ ప్రజలు ఈ దేశంలో 'రెండో శ్రేణి పౌరులుగా' బతకడానికి ఇష్టపడరని అనడం చర్చనీయాంశంగా మారింది.

## రాష్ట్రానికి పెట్టుబడులు పెరుగుతున్నాయి

అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులు పెరుగుతున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రూ.20 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తున్నాయని.. దీని ద్వారా 22 లక్షల మందికి ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ నియోజకవర్గ పరిధిలోని సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన 'మీ భూమి.. మీ హక్కు' కార్యక్రమంలో రైతులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన పాసు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా భూములను సర్వే చేశామన్నారు. ఎవరైనా హ్యాక్ చేసినా వెంటనే తెలిసిపోతుందని చెప్పారు. రైతుల సమక్షంలో సర్వే చేసి ఈకేవైసీ తీసుకున్నామని వివరించారు. ఇప్పటి వరకు 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని.. 26.46 లక్షల మందికి పట్టాదారు పాసు పుస్తకాలిచ్చామన్నారు. "మెగా డీఎస్సీ నిర్వహించి 16,500 మందికి టీచర్ పోస్టులిచ్చాం. ఎన్ని కుట్రలు పన్నినా ఏడాదిలోగా ఉద్యోగాలు భర్తీ చేశాం. గొడ్డలి పార్టీ చేసేవన్నీ తప్పుడు ప్రచారాలే. నేరాలు- ఘోరాలు వాళ్లే చేసి.. ఎదుటివాళ్లపై వేస్తారు. బాబాయ్‌ని చంపేసి గుండెపోటుగా చిత్రీకరించారు. ఇక్కడి నుంచి గొడ్డలి పార్టీ నేతలు తెలంగాణకు కూడా వెళ్లారు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.1500 కోట్ల ఆస్తులు కొట్టేశారు. ఇలాంటి నేతలను గొడ్డలి పార్టీ ఎందుకు సస్పెండ్ చేయలేదు. ఇక్కడ వాళ్ల ఆటలు సాగవని.. తెలంగాణలో రికార్డులు తారుమారు చేశారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతుల బాధలు గుర్తుకురావు. కోడికత్తి డ్రామాలాడే వారికి వరి కోతలు తెలియవు. గంజాయి బ్యాచ్‌ను ఓదార్చే వారికి సాగు తెలియదు. ఆలయాలపై దాడి చేసేవాళ్లకు ప్రజల మనోభావాలు తెలియవు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించాలని చూశారు.. ఈ జన్మలోనే వారిని ఆ దేవుడు శిక్షిస్తాడు." అని చంద్రబాబు అన్నారు.

## రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసింది

కాంగ్రెస్ పార్టీ, గత యూపీఏ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ హయాంలో 'బొగ్గు' అంటే కేవలం కుంభకోణాలు, అవినీతి, అనిశ్చితికి మాత్రమే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండిపడ్డారు. గత యూపీఏ పాలనలో బొగ్గు శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి జైలుకు కూడా వెళ్లారని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ కాలంలో ఏకంగా రూ. 1.86 లక్షల కోట్ల భారీ బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని, ఆ తర్వాత సుప్రీంకోర్టు సైతం యూపీఏ ప్రభుత్వం కేటాయించిన అన్ని బొగ్గు గనుల కేటాయింపులను రద్దు చేసిందని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా, గత 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో బొగ్గు రంగాన్ని అవినీతి రహితంగా మార్చామని... ప్రస్తుతం దేశంలో బొగ్గు నిల్వలు రికార్డు స్థాయిలో 189 మిలియన్ టన్నులకు చేరుకున్నాయని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రస్తుతం 'అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్' (బొగ్గు వాయువుగా మార్చే ప్రక్రియ) పై చురుగ్గా అధ్యయనం చేస్తోందని మంత్రి వెల్లడించారు. దీనిపై ప్రైవేట్ కంపెనీలతో జూన్ 11న ఒక కీలక సమావేశం జరగనుందని, 2028 నాటికి అన్ని బొగ్గు బ్లాకులను మూసివేయాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. అలాగే క్రిటికల్ మినరల్స్ మిషన్ కింద రూ. 1,500 కోట్లు మంజూరు చేశామని.. ప్రస్తుతం భారతదేశం 24 రకాల కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటోందని, ఇందులో భాగంగానే అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్ బ్లాకులను ప్రభుత్వం దక్కించుకుందని వివరించారు. రాష్ట్రంలో భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే.. సింగరేణి కార్మికులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నును ప్రభుత్వమే స్వయంగా చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో పార్టీ రాజకీయ ఉనికిని బలోపేతం చేయడంతో పాటు.. అభివృద్ధి, సంక్షేమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహంలో భాగంగా కేంద్రమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులివ్వండి

అమరావతి: గోదావరిలో కాలుష్యానికి కారణమవుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ రోజు సేకరించిన నమూలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలపై రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో పవన్ సమీక్షించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకోసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# గొడ్డలి పార్టీకి రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత లేదు

మొదటి పేజీ తరువాయి

16 వేల టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. ఏం చెప్పాలో తెలియక నేరాలు చేసి, ఎదుటివారిపై దుష్ప్రచారం చేయడమే 'గొడ్డలి పార్టీ' పనిగా పెట్టుకుందని విమర్శించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకురారని, కోడికత్తి డ్రామాలు ఆడేవాళ్లకు వరికోతలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు.

భూ రికార్డుల ప్రక్షాళన.. రాజముద్రతో పాస్‌పుస్తకాలు

భూ వివాదాలకు తావులేని గోదావరి జిల్లాల్లో గత పాలకులు చిచ్చుపెట్టి రికార్డులు తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి ప్రజల భూములను కాజేయాలని చూశారని, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. "మేం అధికారంలోకి రాగానే ఆ నల్ల చట్టాన్ని రద్దు చేసి భూ యాజమాన్య హక్కుల్ని కాపాడాం. భూమి మీద, కానీ ఫొటోలు వారివి ముద్రించుకున్నారు. పొలం సరిహద్దు రాళ్లపై కూడా వారి బొమ్మలు వేసుకున్నారు" అని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి పటిష్టమైన చర్యలతో, కరెన్సీ నోట్ల తరహా భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 26.46 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేశామని, నిర్దేశిత గడువులోగా మొత్తం 90 లక్షల పుస్తకాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖలో సమూల




మార్పులు తెచ్చి, 1.37 లక్షల ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములను 22ఏ నుంచి తప్పించామని పేర్కొన్నారు.

రెండేళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమం

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని చంద్రబాబు తెలిపారు. ఈ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో సభలు పెడుతున్నామన్నారు. "అభివృద్ధిని తిరిగి ట్రాక్‌లో పెట్టాం. అందుకే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి, యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం. సూపర్ సిక్స్‌లో చెప్పిన వాటికంటే అదనంగానే ఇచ్చాం" అని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం వాటాతో కలిపి రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని చెప్పారు.

గోదావరి జిల్లాలకు పెద్దపీట

దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా ఉన్న గోదావరి జిల్లాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు పడిన ఇబ్బందులను గుర్తుచేస్తూ, తాము 24 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నామని, ఫీడ్ ధరల పెరుగుదల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు.

గొడ్డలి పార్టీకి రాజకీయాలు చేసే అర్హత లేదు

తెలంగాణలో ఎమ్మార్వో, జేసీ సంతకాలు ఫోర్జరీ చేసి రూ.1500 కోట్ల భూకుంభకోణానికి పాల్పడిన వినుకొండ మాజీ ఎమ్మెల్యేను వైసీపీ అధ్యక్షుడు ఎందుకు సస్పెండ్ చేయలేదని చంద్రబాబు ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కూడా కల్తీ చేసి అపవిత్రం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత 'గొడ్డలి పార్టీ'కి లేదని, వారు రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే గంజాయి బ్యాచ్‌లను, గొడ్డలి పార్టీ వ్యక్తులను ప్రజలు దూరంగా పెట్టాలని పిలుపునిచ్చారు.

## రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మొదటి పేజీ తరువాయి

"తెలంగాణ ప్రజలతో గోక్కున్నవాడు ఎవరూ బాగుపడలేదు" అంటూ రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్డు వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి కాళ్లల్లో కట్టెలు పెట్టి ఆపుతున్నారని ఆయన ఆరోపించారు. "రీజనల్ రింగ్ రోడ్డు అనుమతుల కోసం నేను యాభై సార్లు ఢిల్లీకి వెళ్లాను, ప్రధానిని కలిశాను. దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కిషన్ రెడ్డికి లేదా? హైదరాబాద్ ప్రజలు ఆయనకు ఓట్లు వేయలేదా?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అన్ని అనుమతులు వచ్చాక మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని, మూసీ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, మిగిలిన 25 లక్షల టన్నులను కేంద్రంతో కొనిపించే బాధ్యత కిషన్ రెడ్డికి లేదా అని నిలదీశారు. బీజేపీలో ఉంటూనే చీకట్లో ఇతరులతో కిషన్ రెడ్డి సహకారం తీసుకుంటున్నారని, గతంలో కుమ్మక్కు రాజకీయాలు చేసినందుకే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అభివృద్ధి విషయంలో తాను రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని సీఎం స్పష్టం చేశారు. "నిజంగా నేను రాజకీయం చేస్తే, బీఆర్ఎస్ నేత బండారు లక్ష్మారెడ్డి తండ్రిగారైన బండారు రాజిరెడ్డి పేరును ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు పెట్టేవాడిని కాదు. ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తించాం" అని తెలిపారు. అభివృద్ధి కోసం కలిసి వస్తే ఎల్బీ స్టేడియంలో కిషన్ రెడ్డికి గండపెండేరం తొడుగుతామని, కానీ ఆయన సహకరించడం లేదని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం వల్లే తాను ఈరోజు ముఖ్యమంత్రిగా ఉన్నానని, కొడంగల్‌లో ఓడిపోయిన తనను ఇక్కడి ప్రజలే ఆశీర్వదించి గెలిపించారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. మల్కాజిగిరిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగానే పరిపాలన సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. మూసీ ప్రక్షాళన రెండో దశను నాగోల్ నుంచి గౌరెల్లి వరకు చేపడతామని, వంద రోజుల్లో కార్యాచరణ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలప్పుడు రాజకీయాలు చేద్దామని, ఇప్పుడు నగరాభివృద్ధికి అందరూ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇరాన్‌కు వెళ్లొద్దు.. ఆ దేశంలో ఉన్నవారు వెంటనే వచ్చేయండి భారతీయులకు కేంద్రం సూచన

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని తన పౌరులకు నేడు మరోసారి సూచించింది. ఈ మేరకు టెహరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. "ఈ ప్రాంతంలోని తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దని మా పాత సలహాను పునరుద్ఘాటిస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా దేశం విడిచి వెళ్లాలని సూచిస్తున్నాం" అని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి. ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు, సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు. అమెరికా పచ్చజెండా ఊపడంతోనే ఇజ్రాయెల్ ఫాస్ఫరస్ బాంబుల వంటి నిషేధిత ఆయుధాలను వాడుతూ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖొమైనీ, ఇతర సైనిక ఉన్నతాధికారులు మరణించడంతో ఈ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ పలుచోట్ల డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసింది. ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే, శాంతి స్థాపన కోసం ఇరాన్, అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నట్లు కూడా నివేదికలు వస్తున్నాయి.

## 27,000 పాఠశాలలను 4,000గా మార్చడం దారుణం

హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్న 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని టీఆర్ఎస్ చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వపు ఈ నిర్ణయం పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉందని ఆమె ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో కవిత ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నిర్ణయం అత్యంత దారుణమని ఆమె అభివర్ణించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా, కనీసం సమీక్ష కూడా నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు పాఠశాలలు మూసివేతపై దృష్టి సారించడాన్ని ఆమె విమర్శించారు. విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని ఆయన గణాంకాలను వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటిపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలతో రాష్ట్రం విద్యా రంగంపై చర్చ మరోసారి తీవ్రస్థాయికి చేరింది. కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

## మమతకు భారీ షాక్: టీఎంసీకి, ఎంపీ పదవికి సీనియర్ నేత రాజీనామా

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం మూటగట్టుకున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా, ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సుఖేందు శేఖర్ రే సోమవారం తన ఎంపీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా, 2011 నుంచి పార్టీలో కీలక పాత్ర పోషించిన సుఖేందు నిష్క్రమణ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. సోమవారం పార్లమెంటుకు చేరుకున్న సుఖేందు శేఖర్, తన రాజీనామా లేఖను సమర్పించారు. అదేవిధంగా పార్టీని వీడుతున్నట్లు తెలుపుతూ అధినేత్రి మమతా బెనర్జీకి కూడా రాజీనామా లేఖను అందజేశారు. టీఎంసీ పాలనలో పెచ్చరిల్లిన అవినీతి, మహిళల భద్రతలో వైఫల్యం, విద్య, ఆరోగ్య వంటి కీలక రంగాల్లో వెనుకబాటుతనం వంటి అంశాలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. ప్రజలు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును గౌరవిస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బెంగాల్‌లో నూతనంగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేయడాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను బీజేపీ 207 స్థానాలను కైవసం చేసుకుని, 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రమయ్యాయి. సుమారు 60 మంది ఎమ్మెల్యేలు, 20 మంది ఎంపీలు పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారని, వారంతా బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సుఖేందు రాజీనామా, రానున్న రోజుల్లో పార్టీలో మరిన్ని రాజీనామాలు చోటుచేసుకునే అవకాశం ఉందనే సంకేతాలిస్తోంది. విపక్ష 'ఇండియా' కూటమి సమావేశం కోసం మమతా బెనర్జీ ఢిల్లీ పర్యటనలో ఉన్న సమయంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

## ఏపీలో రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటును పరిశీలించండి

అమరావతి: రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాకుళంలో ఉన్న ఖనిజ వనరుల ఆధారంగా డీప్ ప్రాసెసింగ్, రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని మంత్రి నారా లోకేశ్ రష్యాకు చెందిన రేర్‌ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులను కోరారు. రష్యా పర్యటనలో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులతో లోకేశ్ మాస్కోలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "భారత్‌లో విస్తరిస్తున్న ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లకు సరఫరా చేసేందుకు గిరెడ్మెట్ ప్రాసెసింగ్ టెక్నాలజీని వినియోగించి, నెల్లూరులో ఫుల్ సైకిల్ రేర్‌ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ కోసం నియోడైమియం మ్యాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటులో భాగస్వాములు కావాలి. భారత్ టెక్ కారిడార్‌లో సిద్ధంగా ఉన్న ప్లగ్ అండ్ ప్లే ప్రయోగశాలలు వినియోగించి మెటలర్జీ అల్ట్రా-ప్యూర్ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ ఏర్పాటుకు చొరవ చూపండి. పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుంచి అరుదైన లోహాలు వెలికితీసేందుకు, సాంకేతికతను అందించడంలో భాగస్వాములు కావాలి" అని కోరారు. మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియంను లోకేశ్ సందర్శించారు. మాస్కో ప్రభుత్వం, రొసాటమ్ స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ మ్యూజియం అణుశక్తి చరిత్రను మాత్రమే కాకుండా.. శాంతియుత అణు వినియోగ విజయాలనూ వివరిస్తుంది. 25 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఈ మ్యూజియం ఏర్పాటైంది. సోవియట్ అణు ప్రాజెక్టు ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు వివిధ అంశాలను ఈ మ్యూజియంలో ప్రదర్శిస్తారు. ఇప్పటివరకు 80 దేశాలకు చెందిన 35 లక్షల మంది ఈ ప్రదర్శనశాలను సందర్శించారని నిర్వాహకులు మంత్రి లోకేశ్‌కు వివరించారు.

## డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ భూదందాలు.. సస్పెండ్ చేసిన ప్రభుత్వం!

హైదరాబాద్: హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. హౌసింగ్ బోర్డులో 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్‌పై హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన రాము నాయక్ అనేక భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా తేలిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు.. కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డు, ప్రభుత్వ స్థలాలు పరిశీలిస్తుండగా.. రాము నాయక్ భూలీలలు బయటకు వచ్చాయని మంత్రి తెలిపారు. బహిరంగ మార్కెట్లో గజం సుమారు రూ.2లక్షల ధర ఉన్న హైకోర్టు గేట్ల వద్ద హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడిందని మంత్రి తెలిపారు. హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి సస్పెండ్ అయిన ఇఫ్తాకర్ అహ్మద్ భార్య పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని.. ఆ తర్వాత 2025లో ఆ భూమి మరొకరి పేరిట మారినట్లు విచారణలో తేలిందని పొంగులేటి తెలిపారు. భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌పై కూడా విచారణకు ఆదేశించామని మంత్రి పొంగులేటి తెలిపారు. రాము నాయిక్ భూదందాలపై 2017 నుంచే పలు కేసులు ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ పాలకులు స్పందించలేదని మంత్రి చెప్పారు. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 గజాలు, లక్ష్మిగూడలో 130 గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 గజాల స్థలాలను రాము నాయక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని.. వాటన్నింటిపై విచారణ జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కేసుల్లో సబ్ రిజిస్ట్రార్ల పాత్రపై విచారణ జరపాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఐజీని ఆదేశించామన్నారు. రాము నాయక్‌పై విచారణ పూర్తి చేసి అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని తెలిపారు. రాము నాయక్ భూఅక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించామని.. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా.. ఆక్రమణలకు సహకరించినా ఉపేక్షించేది లేదని, ఏ హోదాలో ఉన్నప్పటికీ నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని.. క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు.

## పెళ్లికి ముందు లైంగిక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

ఢిల్లీ: ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే.. దాని ఆధారంగా వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి అనే అభ్యర్థి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ 2014లో అతనిపై ఓ యువతి క్రిమినల్ కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకొచ్చాయి. ఈ పాత కేసును కారణం చూపిస్తూ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ అతని ఉద్యోగాన్ని రద్దు చేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. పోలీసు బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉన్నంత మాత్రాన, ఆ తర్వాత వారు పెళ్లి చేసుకోలేదనే ఒకే ఒక్క కారణంతో ఒకరు మరొకరిని మోసం చేశారని అనుకోలేమని స్పష్టం చేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీ లేదని ధర్మాసనం పేర్కొంది. లోక్ అదాలత్‌లో కేసు రాజీపడినంత మాత్రాన అభ్యర్థి తన తప్పును ఒప్పుకొన్నట్లు కాదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకుని రాజీపడినప్పుడు.. సదరు అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేయడానికి పోలీస్ బోర్డుకు ఎలాంటి హక్కు లేదని తేల్చిచెప్పింది. కేవలం విఫలమైన ప్రేమ బంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం పూర్తిగా అన్యాయమని కోర్టు పేర్కొంది. చివరికి సుప్రీంకోర్టు తెలంగాణ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇచ్చిన రద్దు ఉత్తర్వులను పూర్తిగా కొట్టివేసింది. సదరు అభ్యర్థిని వెంటనే విధుల్లోకి తీసుకుని, తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతో పాటు శిక్షణకు పంపాలని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు 'ఇండియా' కూటమి డిమాండ్..

కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో మొత్తం 25 ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు పాల్గొని భవిష్యత్తు వ్యూహాలపై చర్చించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలపై చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కూటమి తీసుకున్న ఐదు కీలక నిర్ణయాలను ఖర్గే ప్రకటించారు.

1. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో జరిగిన లోపాలు, 'ఓట్ల దోపిడీ' అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయాలని నిర్ణయించారు. ఈ లేఖను వీలైనంత త్వరగా ఆయనకు అందజేయనున్నారు. 2. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలోనే నీట్, సీబీఎస్ఈ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని.. దీనివల్ల లక్షలాది మంది యువత భవిష్యత్తు రోడ్డున పడిందని మండిపడ్డారు. ఇందుకు బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. 3. దేశంలోని తీవ్ర ఆర్థిక పరిస్థితులు, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు, రైతుల సమస్యలపై కూటమి తరఫున నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. 4. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఇకపై ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా తదుపరి కూటమి సమావేశాన్ని వచ్చే ఆగస్టులో హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కచ్చితమైన తేదీని త్వరలోనే ఖరారు చేస్తారు. 5. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపై నడవాలని నిర్ణయించాయి. ఇందుకోసం పార్లమెంట్ జరుగుతున్న ప్రతిరోజు ఉదయం లోక్‌సభ ప్రతిపక్ష నేత కార్యాలయంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

## శారీరక మానసిక ఆరోగ్యం యోగ సాధనకో సాధ్యం

– ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

– యోగాంధ్రా కార్యక్రమాలను ప్రారంభం



ఒంగోలు, నేటి శుభోదయ ::: యోగ సాధనతో శారీరక మానసిక స్థితి మెరుగుపడుతుందని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం కలెక్టర్ కార్యాలయం ప్రకాశం భవనం వద్ద ఏర్పాటు చేసిన యోగ సాధన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ యోగా వలన లభించే ఫలితాలను ప్రజలందరికీ అందించే అవకాశమును తెలుపడానికి కేంద్ర ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవమును నిర్వహిస్తున్నది, రాష్ట్ర ప్రభుత్వము కూడా జరుపుటకు నిర్ణయించింది. ఈ యోగా దినోత్సవమును పురస్కరించుకొని ప్రతి జిల్లా కేంద్రములో, మండల, స్థాయిలలో నిర్వహించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు, పదిహేను రోజుల ముందు నుండి అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను సమాయత్తం చేస్తూ ఈ రోజు ప్రజలు, ఉద్యోగులు అందరూ కలసి ఇక్కడ యోగ సాధన చేయడం జరిగిందని తెలిపారు.



వయసుతో నిమిత్తము లేకుండా అందరూ యోగ సాధనతో ఆరోగ్యం పొందాలని కోరారు. 10 15 సంవత్సరాల నుండి 80, 85 సంవత్సరాల వయసు వరకు ప్రతి ఒక్కరు దృఢంగా ఉండడానికి యోగా దోహదపడుతుందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.యోగ సాధన లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు నగర ప్రజలు పాల్గొని జయప్రదం చేశారు.

## రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్లు పూర్తి



అమరావతి, నేటి శుభోదయ ::: టీడీపీ తరపున రాజ్యసభకు పోటీ చేస్తున్న భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, సానా సతీష్ లు శాసనసభలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాల దాఖలు చేశారు. సానా సతీష్ నామినేషన్‌కు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. భాష్యం రామకృష్ణ నామినేషన్‌కు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రతిపాదకులు ఉన్నారు. చింతకాయల విజయ్ నామినేషన్‌కు మంత్రి కొలుసు పార్థసారథి, పెదకూరపాడు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్, బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. చింతకాయల విజయ్ నామినేషన్ సందర్భంగా అసెంబ్లీకి హాజరైన ఆయన తండ్రి, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు.నామినేషన్ దాఖలుకు ఇవాళ సాయంత్రం 3 గంటలవరకు గడువు పూర్తి అవుతుంది. మంగళవారం నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన జనసేన అభ్యర్థి లింగమనేని రమేష్ మాత్రమే అని తెలిపారు. కూటమికి అసెంబ్లీలో ఉన్న 164 మంది సభ్యుల బలం నేపథ్యంలో టీడీపీ అభ్యర్థులు భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, సానా సతీష్‌తో పాటు జనసేన అభ్యర్థి లింగమనేని రమేష్ లు ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికయ్యే అవకాశంవిత్ డ్రా గడువు ముగిసిన అనంతరం అధికారికంగా ప్రకటించనున్న అధికారులు.

## జగన్ పాలనలో రైతులు భయంగా కాలం వెళ్ళదీశారు

: మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి



నంద్యాల, నేటి శుభోదయ ::: జగన్ గత ఐదేళ్ళ దుష్ట పాలనలో ఎక్కడ మా పొలాలు లాక్కుంటాడోనని రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీశారని, అదే రైతు మోహంలో చిరునవ్వు కోసమే రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు సీఎం చంద్రబాబు నాయుడు అందిస్తూ మనోధైర్యం నింపారని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం, పగిడ్యాల మండలం పాతముచ్చుమర్రి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీ భూమి మీ హక్కు నూతన రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పగిడ్యాల మండల తహసిల్దారు శివ రాములు, ఎంపీడీవో సుమిత్రమ్మ, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ రవికుమార్, గ్రామ పెద్దలు వెంకట్రామిరెడ్డి, విఆర్వో, వి ఆర్ ఏ లు, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామ రైతులకు రాజ ముద్ర గల పట్టాదారు పాస్ పుస్తకాలను మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పంపిణీ చేశారు.

## మాచర్ల మోహన్‌రావుపై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించిన జాతీయ చేనేత ఐక్య వేదిక



పెద్దపప్పూరు జూన్ 08 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : చేనేతల సమస్యల పరిష్కారానికి, అక్రమ భూకబ్జాల నిరోధానికి నిరంతరం పోరాడుతున్న ప్రముఖ ప్రజానాయకుడు మాచర్ల మోహన్‌రావుపై జరిగిన దాడి మరియు హత్యాయత్నాన్ని జాతీయ చేనేత ఐక్య వేదిక తీవ్రంగా ఖండించింది. సోమవారం పెద్దపప్పూరు మండల కేంద్రంలోని చేనేత సంఘం కార్యాలయంలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప, చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.గత నాలుగు దశాబ్దాలుగా బడుగు, బలహీన వర్గాల కోసం, చేనేత కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడిని అడ్డుతొలగిస్తే, చేనేతల భూములను సులభంగా కబ్జా చేయవచ్చునే దురుద్దేశంతోనే ఈ దారుణానికి ఒడిగట్టారని వారు ఆరోపించారు. మోహన్‌రావుపై జరిగిన దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగినది కాదని, అది సమస్త చేనేత కార్మికుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా వారు పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున దాడి జరిగినా, నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యంలో అవినీతిని, అక్రమాలను నిలదీసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఇలాంటి దాడులకు, దౌర్జన్యాలకు తావులేదని వారు స్పష్టం చేశారు.ప్రభుత్వం మరియు పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి, దాడికి పాల్పడిన వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దోషులను కాపాడే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలు బలపడతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో మాచర్ల మోహన్‌రావుపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా తగిన రక్షణ కల్పించాలని, నిందితులను త్వరగా అరెస్ట్ చేయకపోతే పోలీస్ స్టేషన్ల ముందర పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో చేనేత నాయకులు నారాయణస్వామి, ప్రతాప్ మరియు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు...

## నంద్యాల పార్లమెంట్ పరిధిలో 43 బి ఎస్ ఎన్ ఎల్ కొత్త టవర్లు ఏర్పాటుకు కృషి

– నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



నంద్యాల, నేటి శుభోదయ ::: నంద్యాల పార్లమెంట్ పరిధిలో బి ఎస్ ఎన్ ఎల్ కొత్త టెలికాం 43 టవర్ల మంజూరుకు కృషి చేయడం జరిగిందని, ఇప్పటికే నాలుగు కొత్త బి ఎస్ ఎన్ ఎల్ టెలికాం టవర్లు ప్రారంభించడం జరిగిందని, మిగిలిన 39 నూతన బి ఎస్ ఎన్ ఎల్ టవర్ల మంజూరు, నిర్మాణం జరుగుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.టెలికాం సేవా ప్రదాతలు తమ నెట్‌వర్క్‌ను సొంతంగా విస్తరించడం, వాణిజ్యపరంగా లాభదాయకం కాదని భావించిన మారుమూల సేవలు సరిగా అందని గ్రామాలకు 4జి మొబైల్ కవరేజీని అందించే లక్ష్యంతో, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్, టెలికమ్యూనికేషన్స్ విభాగం (డిఓటి) ఆధ్వర్యంలో డిజిటల్ భారత్ నిధి (డిబిఎన్) నిధులతో నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో పలు 4జి మొబైల్ ప్రాజెక్టులను చేపడుతోందన్నారు. ఈ ప్రాజెక్టుల విజయవంతమైన అమలు, కవరేజ్ లేని ఈ గ్రామాలకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందనీ, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుందనీ, దేశంలోని విస్తృత సామాజిక ఆర్థిక వ్యవస్థలో వాటి ఏకీకరణను సులభతరం చేస్తుందన్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ప్రాజెక్టుల కింద, ఇప్పటివరకు 4 టవర్లను ప్రారంభించడం ద్వారా నియోజకవర్గంలోని 4 గ్రామాలకు 4జి మొబైల్ నెట్‌వర్క్ కవరేజ్ అందించబడిందన్నారు. దీనికి అదనంగా, మిగిలిన ప్రాంతాలలో 43 మొబైల్ టవర్లను అదనంగా ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేయబడిందనీ, ఈ అదనపు టవర్ల జాబితా అనుబంధం-2 గా జతచేయబడిందని. నిర్ణీత సమయంలో టవర్‌ను ప్రారంభించడానికి అవసరమైన భూ కేటాయింపు ప్రక్రియ, ఇతర సంబంధిత కార్యకలాపాలను త్వరగా పూర్తి చేయడం కోసం బీఎస్ఎన్ఎల్ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరుపుతోందని. బీఎస్ఎన్ఎల్‌కు భూమిని అప్పగించిన వెంటనే టవర్ నిర్మాణ పనులు ప్రారంభించబడతాయన్నారు. ఈ అదనపు టవర్లు మార్చి, 2027 నాటికి ప్రారంభించ బడతాయని భావిస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆశాభావం వ్యక్తం చేశారు.

## "దోషులను కఠినంగా శిక్షించి ఎన్టీఆర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలి"

: కొల్లు వెంకటేశ్వర రావు



కోదాడ, నేటి శుభోదయ :: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కీ.శే. నందమూరి తారకరామారావు విగ్రహానికి నల్లగొండ పట్టణంలో నిప్పు పెట్టి అవమానించిన ఘటనను తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తెలంగాణలో కరణం, మున్సుబు వ్యవస్థను రద్దు చేసి తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని గుర్తు చేసారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆనాటి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4.5 లక్షల రేషన్ కార్డుదారులకు నెల ఒక్కంటికి 25 కిలోల బియ్యాన్ని కిలో 2/-రూ.లకే అందించారని తెలిపారు. నల్లగొండ జిల్లాలో వేలాదిమంది పేద రైతులకు భూమి పట్టాలు, 2 సెంట్ల చొప్పున 62 వేల పేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేసారని చెప్పారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గాల్లో అనేక ఎత్తిపోతల పథకాలను ప్రారంభించడమే కాక జిల్లా వ్యాప్తంగా 2లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్ళు అందించిన కృషివలుడు నందమూరి అని కొనియాడారు. ఎన్టీఆర్ బీసీలకు రిజర్వేషన్ కల్పించిన కారణంగానే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేకమంది బీసీలు నాయకులుగా ఎదిగి ఈరోజు రాష్ట్రస్థాయిలో మంత్రులుగా ఉన్నారని తెలిపారు. ఇంతగా ఉమ్మడి రాష్ట్రంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాని అభివృద్ధి పరచిన, నల్లగొండ ఎమ్మెల్యేగా గెలిచిన, జిల్లా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పు పెట్టడం క్షమించరాని నేరమని, దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టే అసాంఘిక శక్తులను అణచి వేసి, తెలంగాణ వ్యాప్తంగా ఎన్టీఆర్ విగ్రహాలకు తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసారు.

## యాడికి పంచాయతీ ఓటర్ల జాబితా, వార్డుల విభజనపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు



అనంతపురం / యాడికి జూన్ 08 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :గత ప్రభుత్వ హయాంలో యాడికి పంచాయతీ పరిధిలోని ఓటర్ల జాబితా, వార్డుల విభజనను ఇష్టానుసారంగా మార్చేశారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్తి రుద్రమ నాయుడు ఆరోపించారు. సోమవారం అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మను కలిసి ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. యాడికి పంచాయతీలో ఆరు, ఏడు వార్డుల తర్వాత సంబంధం లేకుండా 17వ వార్డును కలిపారని, అలా కాకుండా నిబంధనల ప్రకారం 16వ వార్డు తర్వాతే 17వ వార్డు వచ్చేలా ఓటర్ల జాబితాను తక్షణమే సవరించాలని ఆయన కోరారు.యాడికి పంచాయతీ పరిధిలో మొత్తం 20 వేల మంది ఓటర్లు ఉన్నారని, అందులో యాడికి పట్టణంలో 16 వేలు, యాడికి మజారా ఏడు గ్రామాలలో కలిపి మరో నాలుగు వేల మంది ఓటర్లు ఉన్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రస్తుతం ఓటర్ల సర్వే కార్యక్రమం జరుగుతోందని, దీనితో పాటే వార్డుల విభజనను కూడా సక్రమంగా వార్డుల వారీగా నిర్వహించాలని కోరారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న దృష్ట్యా, ఓటర్లు ఇబ్బంది పడకుండా ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని రుద్రమ నాయుడు అధికారులను డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ యాప్ ద్వారానే యూరియా, డీఏపీ పంపిణీ

నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్లపై చర్యలు



యాడికి జూన్ 08 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఏవో మహోభాషా తెలియజేశారు. ఇకపై రైతులకు ఎరువులు పంపిణీ చేయాలంటే ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారానే ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. గత ఏడాది రైతులు ఏయే పంటలు సాగు చేశారనే వివరాల ఆధారంగా, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మోతాదు మేరకే రైతులకు ఎరువులను కేటాయించడం జరిగింది. ఎరువులు కావలసిన రైతులు డీలర్ల వద్దకు వెళ్లి తమ గుర్తింపు వివరాల ద్వారా తమకు ఎన్ని యూరియా, డీఏపీ బస్తాల అర్హత ఉందో తెలుసుకోవచ్చు. అనంతరం ప్రస్తుతం తమకు అవసరమైన ఎరువుల పరిమాణాన్ని నమోదు చేయించుకుని వాటిని పొందాల్సి ఉంటుంది.వ్యవసాయం కోసం ప్రభుత్వం ఇచ్చే రాయితీ ఎరువులు ఇతర అవసరాలకు పక్కదారి పట్టకుండా, బ్లాక్ మార్కెట్ తరలకుండా కట్టడి చేయడానికే ఈ నూతన విధానాన్ని తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల నిజమైన రైతులకు మాత్రమే సాగు కొరకు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. అదేవిధంగా, డీలర్లు రైతులకు ఎరువులను విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రసీదులు (బిల్లులు) ఇవ్వాలని, ప్రభుత్వ అనుమతి మేరకు ఉన్న ధరలకే అమ్మకాలు జరపాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించి రసీదులు ఇవ్వని డీలర్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా హెచ్చరించారు.

## "ఎవరు హయాంలో అభివృద్ధి జరిగింది బహిరంగ సవాల్ విసిరిన తెలుగుదేశం శ్రేణులు"



తాడేపల్లిగూడెం జూన్ 8 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: ఎవరు హయాంలో అభివృద్ధి జరిగిందో మీడియా సమక్షంలో చర్చకు సిద్ధమని తెలుగుదేశం శ్రేణులు బహిరంగ సవాల్ విసిరారు.. స్థానిక ఎం వి ఆర్ గ్రాండ్ లాడ్జి కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకుపోతుందని వైసీపీ హయాంలో ఎక్కడ అభివృద్ధి జరగలేదని జేబులు నింపుకోవడమే వైసీపీ ప్రభుత్వం పనిచేశారని తెలుగుదేశం శ్రేణులు పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు పసల కొండ మాట్లాడుతూ వైసీపీ హయాంలో జగనన్న లేఔట్ పేరు చెప్పి మట్టి అమ్ముకొని గతంలో మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ లక్షలు బిల్లులు పెట్టుకొని దోసుకున్నారని మేము నిరూపిస్తామని సవాల్ విసిరారు. వాడపల్లి సుబ్బరాజు మాట్లాడుతూ కొత్తగా నియమించిన రఘురాం నాయుడు మీ పాత వైసీపీ ఇంచార్జ్ చేసిన అకృత్యాలు మీకు తెలియవా అనే ప్రశ్నించారు. జగనన్న ప్రభుత్వంలో మీ ఇష్టానుసారంగా దోచుకుని దాచుకున్నారని రోడ్లు చెరువులుగా మారాయని అన్నారు. ఎక్కడైనా ఒక్క రోడ్డైనా వేశారా మా హయాంలో 80% రోడ్లు వేసామని ఎక్కడా అవినీతి లేకుండా స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పాలన కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. బేతిన గిరిధర్ మాట్లాడుతూ కొత్తగా నియమించిన ఇంచార్జ్ రఘురామనాయుడు గతంలో ఇక్కడ పరిపాలించిన వైసీపీ నాయకుడు ఎవర్ని వదిలి పెట్టలేదని ఈ విషయం మీకు ఫతెలియదా మీకు కనబడలేదా అని ప్రశ్నించారు. మా హయాంలో అవినీతి లేని సుపరిపాలన పార్టీలకతీతంగా మా స్థానిక శాసనసభ్యులు పనిచేస్తున్నారని తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికి కులము లేదు, మతం లేదు, పార్టీలు లేవు అందర్నీ సమన్యాయం చేస్తున్న ఏకైక నాయకుడు బొలిశెట్టి శ్రీనివాస్ అని అన్నారు. ఆపదలో తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికి సహాయం చేసి పంపించే నాయకుడని కొనియాడారు.వట్టికూటి అబ్బు మాట్లాడుతూ అవినీతి పాలన కొనసాగించిన మీరు మమ్మల్ని ప్రశ్నించేది మీకు దోచుకోవడం తప్ప పరిపాలించడం చేతకాని దద్దమ్మ వైసీపీ పార్టీ అని, కళ్ళు లేని కబోదుల్లా మీరు చూస్తున్నారా మీ హయాంలో అవినీతి గురించి మీకు తెలియదా అని ప్రశ్నించారు. మద్దిపాటి ధర్మేంద్ర మాట్లాడుతూ మీ హయాంలో జరిగిన డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, కోడి కత్తి శ్రీను, తదితరులు అందరు మీ బాధితులే అన్నారు. నడిరోడ్డు మీద డాక్టర్ సుధాకర్ కరోనా టైంలో మాస్కులు అడిగిన పాపానికి పిచ్చోడనే ముద్ర వేశారని ఆయన అన్నారు. ఇకనైనా అభివృద్ధికి సహకరించండి పరిపాలనకు మద్దతు ఇవ్వండి లేనిపోని ఆరోపణలు చేస్తే మీకు తగిన బుద్ధి చెప్తామని ఆయన తెలిపారు. వచ్చే ఎలక్షన్లలో ఇప్పుడున్న 11 సీట్లు 0% కు మీ పార్టీ పరువు గ్రాఫ్ పడిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రామలక్ష్మణులు, ఏరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ 'శ్రీ విరియాల వెంకట రెడ్డి పంతుల' సత్రం నూతన చైర్మన్‌గా మట్టా నాగేశ్వరరావు నియామకం..!

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకి కృతజ్ఞతలు తెలిపిన నూతన కమిటీ, ఎన్డీయే కూటమి నాయకులు.. సత్రం ఆశయాల సాధనకు, భక్తుల సేవకు కట్టుబడి ఉంటాం..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలానికి చెందిన ప్రముఖ 'శ్రీ విరియాల వెంకట రెడ్డి పంతుల' సత్రం నూతన చైర్మన్‌గా జనసేన పార్టీ నాయకులు మట్టా నాగేశ్వరరావు నియామకం కావడం పట్ల ఎన్డీయే కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు పాలకవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సారథ్యంలో సత్రం ను మరింత అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మట్టా నాగేశ్వరరావు అధ్యక్షుడుగా కొత్త కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి పనులను మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు గ్రామస్తులు, ఎన్డీయే కూటమి నాయకుల సమైక్యంగా కృషి చేస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి తీర్థం రోజుల్లో సత్రం ద్వారా ఐదు రోజుల పాటు జరగాల్సిన అన్నదాన కార్యక్రమాన్ని సక్రమంగా, ఘనంగా నిర్వహించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే ఈ రోజు జనసేన పార్టీ తరపున మట్టా నాగేశ్వరరావు ని చైర్మన్‌గా నియమించడం చాలా సంతోషకరమన్నారు. ఈ మంచి నిర్ణయం తీసుకున్నందుకు ఎమ్మెల్యే బత్తుల కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శ్రీ వి.వి. రెడ్డి పంతుల ఆశయాలకు అనుగుణంగా, జనసేన పార్టీ మరియు ఎన్డీయే కూటమి తరపున సత్రం ద్వారా భక్తులకు మెరుగైన సేవలందేలా నూతన కమిటీ కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో నూతన కమిటీ మెంబర్లు పసుపులేటి శివ, వాతాడ గోపికృష్ణ, తాటికొండ మృత్యుంజయ రావు, చింతపెంట రామచంద్రరావు, అడివారపు మంగాదేవి, ధనాలకోట లక్ష్మి, తగరంపూడి నాగవేణి సభ్యులుకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అడ్డాల శ్రీను, సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర, కర్రీ గణేష్, ముక్కా రాంబాబు, మేడిశెట్టి శివరామ్, కర్రీ దొరబాబు, మారిశెట్టి త్రిమూర్తులు, తన్నేరు తాతాజీ, చదువు ముక్తేశ్వరరావు, వీరప్పరాజు పోసుబాబు, మంచాల శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు. కొత్త కమిటీ కి శాలువలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

## రైతులకు సబ్సిడీతో ఎరువులు అందిస్తాం

– చంద్రబాబుది రైతు సంక్షేమ ప్రభుత్వం– మహమ్మదాబాద్‌లో రైతులకు ఎరువులు పంపిణీ చేసిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



ఆమడగూరు, నేటి శుభోదయ ::: రైతులకు వ్యవసాయ అవసరాలకు తగిన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో సోమవారం రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, రైతులకు స్వయంగా ఎరువుల బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి రైతుకు ప్రభుత్వ సబ్సిడీతో నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డి ఏ పి ఎరువు బస్తా రూ .1350 లతో యూరియా బస్తా రూ.268 లతో రైతులకు అందిస్తున్నామని అన్నారు. రైతులకు సరిపడేంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 120 బస్తాల డిఏపీ, 140 బస్తాల యూరియా నిల్వ ఉంచినట్లు చెప్పారు.వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు పనులు చేపట్టే విధంగా అవసరమైన



ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గోపాల్ రెడ్డి, ఓడి చెరువు మండల టీడీపి కన్వీనర్ శెట్టి వారి జయచంద్ర,సొసైటీ అధ్యక్షుడు నరేష్ ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణమూర్తి ,స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆస్తి అనేది మన హక్కు

- రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల ఆస్తులకు కూటమి ప్రభుత్వ భద్రత



ఓడి చెరువు, నేటి శుభోదయ ::: ప్రజల ఆస్తి హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు.ఓడి చెరువు మండలం తుమ్మలకుంట్లపల్లిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 608 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, మన పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులను భద్రపరచడం కోసమే కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. రైతుల భూ హక్కులను కాపాడటంతో పాటు వారి ఆస్తులకు చట్టపరమైన భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం విజయ వంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు.దేశంలోనే అత్యధికంగా సామాజిక పెన్షన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.51 వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చిందన్నారు.ఆమడగూరు మండలంలో అతి పెద్ద రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుండటంతో ఈ ప్రాంతానికి ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందన్నారు.పుట్టపర్తి నియోజక వర్గంలోని 193 చెరువులు, రెండు రిజర్వాయర్లను హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో నింపి వ్యవసాయ రంగాన్ని సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.అక్కడే రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతున్న గౌస్ పీరాను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని కొంత ఆర్థిక సహాయాన్ని అందించి వారికి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి , ఎంపీడీఓ శివ ప్రసాద్ రెడ్డి, ఆమడ గూరు మండల కన్వీనర్ సొసైటీ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, సర్పంచ్ శ్రీదేవి ,రవీంద్రనాయుడు ,అంజనప్ప ,జనార్ధనరెడ్డి,ముసలరెడ్డి , గంగినాయుడు, వెంకటేష్ నాయుడు, లక్ష్మీనారాయణ రెడ్డి, సోమశేఖర్ , భాషా ,ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి ,సెక్రెటరీ భరత్,రెవిన్యూ అధికారులు , రైతులు,కూటమి పార్టీల నాయకులు కృష్ణమూర్తి , ఇర్ఫాన్ ,కొండె ఈశ్వరయ్య ,సునీల్ , అరుణ్ సికిందర్ , కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి– ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



పుట్టపర్తి, నేటి శుభోదయ ::: పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఒకసారి వచ్చిన సమస్య మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు తిరిగి వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఎద్దుల బండ్లపోటీలు గ్రామీణ జీవన విధానానికి ప్రతీక

: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

– గుంటిపల్లిలో ఎద్దులబండ్ల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు



కొత్తచెరువు, నేటి శుభోదయ ::: కొత్తచెరువు మండలం గుంటిపల్లి గ్రామంలో నిర్వహించిన సాంప్రదాయ ఎద్దులబండ్ల పరుగు పోటీలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ముందుగా గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న గంగమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎద్దులబండ్ల పోటీల ప్రారంభ కార్యక్రమంలో కొత్తచెరువు చెందిన రైతు సాయికుమార్ ఎద్దుల బండి పోటీల్లో పాల్గొని పోటీలను జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ,గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఎద్దులబండ్ల పోటీలు గ్రామీణ జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తాయని, ఇటువంటి కార్యక్రమాలు యువతలో సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందిస్తాయని పేర్కొన్నారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ,గ్రామీణ క్రీడలను, సాంప్రదాయ కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతిని భావితరాలకు అందించగలమన్నారు. పోటీల నిర్వహణకు కృషి చేసిన నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాళహస్తి ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు రైతు సంఘం జిల్లా నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, సహకార సొసైటీ అధ్యక్షులు హరిప్రసాద్ ,రూరల్ మండల కన్వీనర్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ శివప్రసాద్ , నాగేంద్ర నాయకులు శ్రీనాథ్ సుధాకర్ ,సురేష్, నాయుడు , నవీన్ కుమార్ ,గ్రామ పెద్దలు, యువకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# మనకు ప్రతి ఓటు ఎంతో కీలకం

– వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా రెప రెపలాడాలి – మీరు ఇచ్చిన ధైర్యమే 2024 ఎన్నికల్లో వైసిపి చిత్తుగా ఓడింది – ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి– సూపర్ సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు నేతృత్వంలో సూపర్ హిట్ చేశారు– సంక్షేమం ,అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారం చేయండి– సర్ పై క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండండి

– టీడీపీ ఓట్లు తొలగించకుండా ముందుగా జాగ్రత్తపడండి – స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి– చంద్రబాబుతోనే ఏపీలో సుపరిపాలన– 2029 ఎన్నికల్లో మళ్ళీ కూటమి అధికారంలోకి తెచ్చుకోవాలి– సీఎం చంద్రబాబు అధికారంలో ఉంటేనే ఏపీ లో ఊహించని అభివృద్ధి సాధ్యం– 1లక్షా 51వేల కోట్లతో పుట్టపర్తి నియోజవర్గంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు– రెండేళ్లలో కూటమి పాలనలో నియోజవర్గం కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి– దేశంలోనే వేగవంతంగా ప్రగతి సాధించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఎంతో ముందంజ– విజన్ కలిగిన నాయకుడు ఏపీకి చంద్రబాబు ఉండడం ప్రజల అదృష్టం– ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై నియోజవర్గ క్లస్టర్ ఇంచార్జిలు,కో క్లస్టర్ ,యూనిట్ ఇంచార్జులు,కో యూనిట్ ఇంచార్జులు,టీడీపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన వర్క్ షాప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి – ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే ,మాజీ మంత్రి,– పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెల్లడి






పుట్టపర్తి, నేటి శుభోదయ ::: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంపై పుట్టపర్తి నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జిలు, కో–క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, కో–యూనిట్ ఇంచార్జిలు, టీడీపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన వర్క్‌షాప్ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి ఒక్క ఓటు కీలకమని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ముఖ్యంగా టీడీపీ మద్దతుదారుల ఓట్లు తొలగించ బడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సుపరిపాలన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో మరోసారి కూటమిని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉంటేనే ఆంధ్రప్రదేశ్‌లో ఊహించని స్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.1.51 లక్షల కోట్ల పెట్టుబడులతో భారీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కూటమి పాలనలో కేవలం రెండేళ్ల వ్యవధిలోనే నియోజకవర్గం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు.దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని, దూరదృష్టి, విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి నాయకత్వం వహించడం ప్రజల అదృష్టమని పేర్కొన్నారు.కార్యక్రమానికి ముందు ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ మండల టీడీపీ కన్వీనర్లు ,క్లస్టర్ ఇంచార్జులు , యూనిట్ ఇంచార్జులు ,కో క్లస్టర్ ఇంచార్జు కూటమిపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జిలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఇది ప్రజాస్వామ్యమా కుల స్వామ్యమా..

# 2029 ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం

: లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ సాదే నరేంద్రబాబు




కాకినాడ జిల్లా,జగ్గంపేట, జూన్ 8 నేటి శుభోదయ:జగ్గంపేటలోని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ సాదే నరేంద్రబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు జరిగిన తాజా నామినేషన్లలో సామాజిక న్యాయం పాటించలేదని ఆయన విమర్శించారు.కోటిమంది సభ్యులు ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి ఒక్క రాజ్యసభ సీటు కూడా కేటాయించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎస్టీలు, మైనారిటీలు, మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు.టీడీపీలో సామాజిక న్యాయం, మహిళా భాగస్వామ్యం శూన్యంగా మారిందని పేర్కొంటూ, వివిధ సామాజిక వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రాతినిధ్యం కల్పించలేదని విమర్శించారు.డిప్యూటీ స్పీకర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ప్రజల ఓట్లను నిర్లక్ష్యం చేసే ధోరణిని కూటమి ప్రభుత్వం అవలంబిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో 2029లో జరిగే ఎన్నికల్లో తమ ఓట్ల ద్వారా తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

కాకినాడ జిల్లా, గండేపల్లి జూన్ 8 నేటి శుభోదయ:గండేపల్లి మండల పరిధిలో సోమవారం (08-06-2026) తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం, మురారి గ్రామానికి చెందిన రాండ బుల్లయ్య (35), తండ్రి చిన్న యేసు, ట్రాక్టర్‌పై పొలం దున్నేందుకు మురారి నుండి రాజమండ్రి వైపు వెళ్తుండగా ఉదయం సుమారు 4:45 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. జగ్గంపేట నుండి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చి హారన్ ఇవ్వకుండా ట్రాక్టర్‌ను ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ప్రమాదంలో బుల్లయ్య రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ జి.ఎస్.ఎన్. మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# “పి జి ఆర్ ఎస్- 157 పెన్షన్,

# 12 ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ దరఖాస్తులు స్వీకరణ”




తాడేపల్లిగూడెం జూన్ 8 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::: తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ, మేనేజర్ రవిసుధాకర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈరోజు మొత్తం 157 పెన్షన్ దరఖాస్తులు, ఇంజనీరింగ్ మరియు టౌన్ ప్లానింగ్ సంబంధిత 12 దరఖాస్తులు అధికారులకు అందజేశారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరిస్తామని మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ హామీ ఇచ్చారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పి జి ఆర్ ఎస్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కార స్థితిని దరఖాస్తుదారునికి ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తామని మేనేజర్ రవి సుధాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు మేనేజర్ నాగరాజు,రెవెన్యూ ఆఫీసర్ ప్రసాద్,అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీతారామ్,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జగదీశ్వరరావు పురపాలక సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మధుర జ్ఞాపకాల సందడిలో పూర్వ విద్యార్థులు




పులిచెర్ల, జూన్ 8,(నేటి శుభోదయ) :కాలం గడిచినా, వయసు పెరిగినా స్నేహబంధాలు చెదరవని పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1974 పదో తరగతి పూర్వ విద్యార్థులు మరోసారి నిరూపించారు. ఆదివారం మదనపల్లెలో డాక్టర్ పరంధామ ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ జరిగింది.ఏడు పదుల వయసు దాటినా ఉత్సాహం ఏమాత్రం తగ్గకుండా పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సహపాఠులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల రోజుల ముచ్చట్లు, ఆటలు, గురువుల బోధనలు, జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలను పంచుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు.ఈ సమావేశంలో వెంకట మునినాయుడు, వెంకటాచలం, ప్రముఖ రచయిత రాసాని వెంకట్రామయ్య, ప్రొఫెసర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొని పాత మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చివరగా మళ్లీ కలుసుకోవాలనే ఆశతో సహపాఠులు వీడ్కోలు పలికారు.

# రాజ్యసభ కూటమి అభ్యర్థులకు

## రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అభినందనలు..!!

– అభ్యర్థులను ప్రతిపాదిస్తూ నామినేషన్ పత్రాలపై సంతకం చేసిన ఎమ్మెల్యే..

– ‘చంద్రబాబు నాయుడు ఎంపిక అద్భుతం’ ఎమ్మెల్యే ‘బత్తుల’



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (,ఏ.కె);తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిపిన ముగ్గురు అభ్యర్థులు చింతకాయల విజయ్, బాష్యం రామకృష్ణ, సానా సతీష్ నామినేషన్ దాఖాలు చేసారు. ఈ నేపథ్యంలో ఈ నామినేషన్ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని, వారి అభ్యర్థిత్వాన్ని జనసేన పార్టీ తరుపున ప్రాతిపదిస్తూ సంతకం చేసారు. ఈ సందర్భంగా అభ్యర్థుల నామినేషన్ పత్రాల పై ఆయన సంతకం చేశారు. అనంతరం అభ్యర్థులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించి, విజయకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వారికి, విద్యా రంగంలో విశేష సేవలందించిన ప్రముఖులకు యువ నాయకత్వానికి రాజ్యసభ స్థానాల్లో అవకాశం కల్పించడం అభినందనీయం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక సమతుల్యతను పాటిస్తూ, పార్టీ పట్ల విధేయత కలిగిన సమర్థులైన నేతలను ఎంపిక చేశారు. విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల చైర్మన్ శ్రీ బాష్యం రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా వింగ్‌ను సమర్థవంతంగా నడిపిన యువనేత చింతకాయల విజయ్, సీనియర్ నేత సానా సతీష్ ఎంపికతో పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం బలమైన గళం వినిపించే అవకాశం దక్కింది. ఢిల్లీ పెద్దల సభలో మన రాష్ట్ర ప్రయోజనాల కోసం, కూటమి ప్రభుత్వ ప్రగతి ప్రయాణం కోసం ఈ ముగ్గురు నేతలు అద్భుతంగా పనిచేస్తారనే నమ్మకం ఉందని ఎమ్మెల్యే ‘బత్తుల’ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల ప్రక్రియలో వీరంతా ఏకగ్రీవంగా ఎన్నికై, సగర్వంగా రాజ్యసభలో అడుగుపెడతారని ఎమ్మెల్యే బలరామకృష్ణ ఆకాంక్షించారు.



# ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో

## దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ ధార్మిక పోస్టుల భర్తీకి పరీక్షలు



విజయవాడ, జూన్ 8 (నేటి శుభోదయ):ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖరాష్ట్రం లోని ముఖ్య దేవాలయాల్లో వేదపారాయణదారులు,

అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు, వంట స్వాములు తదితర ధార్మిక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసామని, అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలన అనంతరం హాల్ టిక్కెట్లు జారీ చేసామని, మొదటగా వేదపారాయణదారులుకు పరీక్ష నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ అన్నారు. వేదపారాయణదారుల పోస్ట్ లకు సంబందించిన మౌఖిక పరీక్షలు సోమవారం నుండి ప్రారంభం అవుతున్న సందర్భంగా మాడపాటి అతిధి గృహంలో దేవదాయ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఇటీవల దేవాదాయ శాఖపై సమీక్ష నిర్వహించిన సందర్భంలో రాష్ట్రంలో అన్ని ఆలయాలలో ఖాళీగా ఉన్న వైదిక సిబ్బంది పోస్టులు అన్నీ భర్తీ చేయవలసిందిగా ప్రత్యేకంగా ఆదేశించారని, సదరు ఆదేశాల ప్రకారం వైదిక సిబ్బంది ఖాళీలు ఏవైతే ఉన్నాయో వివరాలు అన్ని సేకరించి,భర్తీకి ప్రత్యేకంగా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించగా, ప్రభుత్వం సెంట్రలైజెడ్ పరీక్ష నిర్వహించి, పూర్తి పారదర్శకత్వంతో ప్రతిభకే పట్టం కట్టే విధంగా నియామకాలు జరుపాలని ఆదేశించిందని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు. 342 ధార్మిక పోస్టులకు గానూ రాష్ట్రవ్యాప్తంగా 5వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని,శ్రీకాకుళం నుండి కృష్ణా జిల్లా గల మల్టీజోన్-1 వేదపారాయణదారుల అభ్యర్థులకు విజయవాడ మాడపాటి అతిధి గృహంలో వేరే జోన్ కు చెందిన పండితులు అర్హత పరీక్ష జరుపుతుండగా, వేరే జోన్ కు చెందిన ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షణ చేస్తున్నారని,గుంటూరు నుండి రాయలసీమ వరకు గల మల్టీ జోన్ -2 అభ్యర్థులకు ఇదే విధంగా సీతానగరంలో పూర్తి పారదర్శకంగా ఈనెల 16 వరకు మౌఖిక పరీక్షలు జరుగుతాయని రామచంద్ర మోహన్ తెలిపారు.ఈ మౌఖిక పరీక్షల్లో పారదర్శకత వహించి, ప్రతిభావంతులకే పట్టం కట్టెందుకు పరీక్షల నిర్వహణ అంతా వీడియో లైవ్ రికార్డింగ్ చేస్తున్నామని,వేదపారాయణదారు పోస్టుల భర్తీలో విద్యార్హతలు, వేదార్హతలు, అనుభవం, మౌఖిక పరీక్షలలో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించి, మెరిట్ జాబితా రూపకల్పన జరుగుతుందని, మూడు ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేసామని, ఏ అభ్యర్థి ఏ ఇంటర్వ్యూ బోర్డుకు వెళ్తారో ఆఖరు నిమిషం వరకు అభ్యర్థికి తెలియదని కమిషనర్ వెల్లడించారు.వేదపారాయణదారు పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు తదితర పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ పేర్కొన్నారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యులు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్



విజయవాడ, జూన్ 8 (నేటి శుభోదయ):- రాజ్యసభ సభ్యులు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఆజాూ) కార్యదర్శి సానా సతీష్ కుటుంబ సభ్యులతో కలిసి రెండవ సారి రాజ్యసభకు ఎంపికైన సందర్భంగా ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానాన్ని దర్శించుకుని, తన రాజకీయ ప్రస్థానం విజయవంతం కావాలని, ప్రజాసేవలో ముందుకు సాగేందుకు శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం ఆలయ పండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ అందజేసారు.

## మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**- మంత్రి పొంగులేటికి సయ్యద్ సాదిక్ అలీ వినతి**



ఖమ్మం, నేటి శుభోదయ ::: రాష్ట్రంలోని మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించి వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఖమ్మం జిల్లా ఏదులాపురంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సయ్యద్ సాదిక్ అలీ మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2.20 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.5 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోనే ఆదర్శప్రాయమైన షాదీఖానా నిర్మించాలని కోరారు. అలాగే ముస్లిం సోదరుల ఖననాల కోసం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఖబరస్తాన్‌గా కేటాయించి, రెవెన్యూ శాఖ ద్వారా హద్దులు నిర్ణయించి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.పల్లెగూడెం ప్రాంతంలో మసీదు నిర్మాణం కోసం 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంతో పాటు, పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపల్ పరిధిలో జనాజా వాహనం అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వెంటనే వాహనం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఈద్గా స్థలాన్ని ఫ్లోరింగ్ చేసి ప్రార్థనలకు అనువుగా తీర్చిదిద్దాలని తెలిపారు. మైనార్టీ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించి కుట్టు మిషన్లు వంటి ఉపాధి సాధనాలను పంపిణీ చేయాలని, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించి అర్హులైన మైనార్టీలకు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడంతో పాటు నూతనంగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీలో వృత్తి విద్యా కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.మైనార్టీల సంక్షేమం, విద్య, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఈ వినతులను సానుకూలంగా పరిశీలించాలని సయ్యద్ సాదిక్ అలీ కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు, మైనార్టీ ప్రతినిధులు, నజీరుద్దీన్ మహమ్మద్ హుస్సేన్ అల్లా బకాష్ జానీ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేత



విజయవాడ, జూన్ 8 (నేటి శుభోదయ):- తాడేపల్లికి చెందిన ఐ అండ్ పి ఆర్ డిపార్ట్మెంట్ వేమూరి ప్రసాద్, శ్రీమతి వెంకటలక్ష్మి దంపతులు పదవీ విరమణ సందర్భంగా అల్లుడు కృష్ణ, కుమార్తె సాయి సింధూర పేర్ల మీద శ్రీ కనకదుర్గమ్మ వారి నిత్యాన్నదాన పథకానికి విరాళంగా రూ.1.01,116/- ఆలయ అధికారులు, ఆలయ అర్చక స్వాములు సమక్షంలో అందజేసారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించి వేద పండితుల ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## ప్రజలతో ముఖాముఖి" అవగాహన సదస్సు విజయవంతం




( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని చినముషిడివాడ జంక్షన్ వద్ద, విశాఖపట్నం సిటీ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమంలో భాగంగా, పెందుర్తి ఇన్స్పెక్టర్ శ్రీ కె.వి. సతీష్ కుమార్ వారు స్థానిక ప్రజలతో సమావేశమై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ నియమాల పాటింపు, ఆస్తి సంబంధిత మోసాలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవల వినియోగం, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా విని, వాటి పరిష్కారానికి తగిన సూచనలు మరియు భరోసా అందించారు.కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజలు పోలీస్ శాఖ చేపడుతున్న ఇటువంటి ప్రజా అవగాహన కార్యక్రమాలను హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. పోలీసు అధికారులు నేరుగా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను తెలుసుకోవడం, చట్టాలపై అవగాహన కల్పించడం మరియు ప్రజలకు అందుబాటులో ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలలో చట్టాల పట్ల అవగాహన పెంపొందించేందుకు పెందుర్తి పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ఇలాంటి కార్యక్రమాలు పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే దిశగా నిర్వహిస్తున్న "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమం విశేష స్పందనతో విజయవంతంగా ముగిసింది.

# చంద్రబాబు రెండేళ్ల పాలనలో అన్ని మోసాలే

**చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ల వ్యంగ్య పాత్రలతో వేషధారణ సుపరిపాలన అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిది.. అప్పనంగా 57 ఎకరాల భూమినీ మింగేసిన భరత్ హామీల అమలు చేయడంలో కూటమి వైఫల్యం రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**




( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందనిమాజీ ఎమ్మెల్యే, వైసీపీ పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు సందర్భంగా వాసుపల్లి ఆధ్వర్యంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, వైసీపీ నేతలు, దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి జిల్లా పరిషత్ జంక్షన్ ఆమ్నెసా ఫంక్షన్ హాల్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. చెడు వినకు, చూడకు, మాట్లాడకు, అనే వానర ఆకృతులతో చంద్రబాబు లోకేష్ పవన్ కళ్యాణ్ మాస్కులతో ధరించిన వ్యంగ్య వేషధారణలు వినూత్నంగా ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వివిధ కులాల పెద్దలు, మత సంఘాల పెద్దలు, అనుబంధ సంఘాల పెద్దలు పాల్గొని కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై వారి వారి అభిప్రాయాలు తెలిపారు. అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అనేక మోసాలు చూసామన్నారు. గత ప్రభుత్వం పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేసి సుపరిపాలన అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిది అని అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు పవన్, కళ్యాణ్, లోకేష్ వైసీపీ కన్నా అత్యధికంగా పథకాలు ఇస్తామని సూపర్ సిక్స్ అంటూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. దక్షిణాది రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ లోనే అత్యధికంగా పెట్రోల్ డీజిల్ ధరలు భగ్గు మంటున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక దేవాలయాల విధ్వంసం చూసామన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్న కూటమి నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. రైతులు యూరియా కోసం లైన్లు కట్టడం చూసాము, సమయానికి యూరియా అందక పంట నష్టపోయారన్నారు. కూటమి వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. పేదలకు వైద్య విద్యను అందించే ఉద్దేశ్యం తో నిర్మించిన 17మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేసిన దుర్మార్గులు చంద్రబాబు,లోకేష్‌పవన్ కళ్యాణ్.. అని అన్నారు అమరావతి ఎత్తిపోతల పథకానికి వేల కోట్ల ప్రజాధనం వృధా చేస్తున్నారు. ఉత్తరాంధ్ర వైద్య ప్రదాయిని కేజీహెచ్ అభివృద్ధి కి 500కోట్ల వైసీపీ పాలనలో ఇచ్చారనీ వాసుపల్లి గుర్తు చేశారు. 2029లో జగన్మోహన్ రెడ్డి పాలన రావడం ఖాయం అని వాసుపల్లి స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు వెంటేశ్వర స్వామి గుడికి దండాలు పెట్టి గుడిమెట్లకి కుంకుమ, పసుపు రాసి దేవుణ్ణి కూడా మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు చంద్రబాబు అండ్ కో దేవాలయాలపై దాడులు చేస్తే నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. అందుకే పవన్ ఆసుపత్రిలో జాయిన్ అయి లంగ్స్, ముక్కుకి ఆపరేషన్లు చేయించుకుంటున్నాడు. పవన్ కళ్యాణ్ జగన్మోహన్ రెడ్డి ని జైల్లో పెట్టాలి అన్నాడు. ఆ మాటకి సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. అమిత్ షా దగ్గర జగన్మోహన్ రెడ్డికి మంచిపేరు ఉంది. అందుకే అమిత్ షా చంద్రబాబు నాయుడు ని దగ్గరకు కూడా రానివ్వడం లేదన్నారు. కొంతమంది అమ్ముడుపోయిన కార్పొరేటర్లు వలనే భరత్ అప్పనంగా 57ఎకరాల భూమి నీ కొట్టేసాడన్నారు. మళ్లీ మా ప్రభుత్వము అధికారంలోకి వచ్చాక గీతం యూనివర్సిటీ పేరుతో దోచుకున్న పేదల భూమిని వెనక్కి తీసుకుని వస్తాం అని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. చంద్రబాబు చేసిన అవినీతి అక్రమాలపై , ప్రజలు అనుభవిస్తున్న కష్టాలను పోస్టర్ లు ద్వారా ప్రదర్శించి నిరసన తెలిపారు. అనంతరం న్యాయవాది ప్రేమ్ కుమార్, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ కే మోసెస్, బీసీ సెల్ తిరుమల దేవి, 31 వ వార్డు సీనియర్ నాయకులు శేఖర్, వార్డు మైనార్టీ అధ్యక్షులు సిహెచ్ కరుణాసాగర్, 35వ వార్డు సీనియర్ నాయకులు చక్రధర్, 36వ వార్డు కార్యదర్శి మహమ్మద్ భాష, 37వ వార్డ్ సీనియర్ నాయకులు కళ్యాణముని, 32 వార్డు బూత్ కమిటీ కార్యదర్శి రామారావు, 33 వ వార్డు నుండి బి శ్రీనివాస్ రెడ్డి, బి లక్ష్మి, 34వ వార్డు జీ కనకరాజు, పాస్టర్ కుర్నిలీస్, 42వ వార్డు ఎం వెంకటేశ్వరరావు, పాల్గొని రౌండ్ టైం సమావేశంలో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, మాజీ కార్పొరేటర్ కోడిగుడ్లల పూర్ణిమ శ్రీధర్,తోట పద్మావతి,బిపిన్ జైన్,వార్డ్ ప్రెసిడెంట్ ,నీలపు సర్వేశ్వర రెడ్డి,పీతల వాసు, దశమంతులు మాణిక్యాలరావు ,దొడ్డి బాపూఆనంద్,...

## నీటి నిల్వల నివారణకు మేజర్ ఔట్‌ఫాల్ డ్రైన్లలో విస్తృతంగా గుర్రపుడెక్కల తొలగింపు



విజయవాడ, జూన్ 8 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్లలో గుర్రపుడెక్కల తొలగింపు పనులను విస్తృతంగా చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇన్నర్ రింగ్ రోడ్‌లోని కండ్రిక జంక్షన్ వద్ద ఉన్న మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో తొలగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు, చీఫ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్) పి. సత్యకుమారి మార్గదర్శకత్వంలో నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రధాన కాలువలు, డ్రైన్లలో గుర్రపుడెక్కలు మరియు ఇతర అడ్డంకులను శరవేగంగా తొలగిస్తున్నామని తెలిపారు.వర్షాకాలంలో నగరంలో ఎక్కడా నీటి నిల్వలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రతిరోజూ కాలువలను పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య, డ్రైనేజీ వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు.

## ప్రజల సమస్యలపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

**వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**




విజయవాడ, జూన్ 8 (నేటి శుభోదయ):- ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు.ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కమిషనర్, గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.మున్సిపల్ సేవల కోసం రూపొందించిన "పురమిత్ర" యాప్‌లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్లించడం కాకుండా, సంబంధిత అధికారులు స్వయంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కమిషనర్ స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 14 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు 5, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా, రెవెన్యూ 1, ఇంజనీరింగ్ 4, ప్రజారోగ్య శాఖలకు సంబంధించిన 1, యూసీడి 2,ఎస్టేట్ 1 ఫిర్యాదులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన, శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి. చంద్రశేఖర్, ఏ. రవీంద్రరావు, కె. శకుంతల, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి హెచ్ రత్న బాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత యోగా శిక్షణతో యోగాంధ్ర

## 2026 నగర ప్రజలకు వియంసి కమిషనర్ ధ్యానచంద్ర పిలుపు



విజయవాడ, జూన్ 8 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర -- ఆరోగ్యాంధ్ర 2026" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నగర పరిధిలోని కందుకూరు కళ్యాణ మండపం, బర్మ్ పార్క్ ప్రాంతం, అంబేద్కర్ స్మృతి వనం వద్ద ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా యోగా శిక్షకుల ఆధ్వర్యంలో కామన్ యోగ ప్రోటోకాల్ లో పాల్గొన్నారు. ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందించడం, యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.అలాగే, ప్రభుత్వం నిర్వహిస్తున్న "యోగాంధ్ర -- ఆరోగ్యాంధ్ర 2026" కార్యక్రమంలో నగర ప్రజలందరూ అధిక సంఖ్యలో నమోదు చేసుకొని పాల్గొనాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా ఉచిత యోగా శిక్షణ, రెండు వారాల ప్రత్యేక ప్రాక్టీస్ కార్యక్రమం నిర్వహించబడుతుందని, అన్ని వయస్సుల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.యోగాంధ్ర -- ఆరోగ్యాంధ్ర 2026 కార్యక్రమంలో పాల్గొన్నరు..

## భార్యభర్తల ఆత్మహత్య అనాథైన నాలుగేళ్ల కుమారుడు..



**రామాటాకీస్ శ్రీనగర్ లో విషాదం..**

( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం నగర నడిబొడ్డున రామా టాకీస్ వద్ద గల శ్రీనగర్ ప్రాంతంలో భార్యభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలనం సృష్టించింది. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాటాకీస్ వెనుక శ్రీనగర్ ప్రాంతంలో ఉన్న ఓ భవనంలో ఆదివారం అర్ధరాత్రి ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం ప్రాంతానికి చెందిన బలరాం (33), ప్రియాంక (27) అనే దంపతులు బ్రతుకుతెరువు కోసం విశాఖ నగరానికి వచ్చారు. వీరిది ప్రేమ వివాహం కాగా, వీరికి నాలుగేళ్ల కుమారుడున్నాడు. ఈ కుటుంబానికి తోడుగా ప్రియాంక తల్లి కూడా ఆ ఇంట్లోనే ఉంటోంది. బలరాం వెల్డింగ్ పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల బలరాం మద్యం సేవించి తనను వేధిస్తున్నట్టు ప్రియాంక పలుమార్లు పోలీసులకు ఫిర్యాదిచ్చింది. ఇదిలా ఉంటే ఆదివారం రాత్రి 10గంటల సమయంలో తనకు బిర్యానీ కావాలని బలరాం ఒత్తిడి చేయడంతో తెచ్చేందుకు ప్రియాంక తల్లి బయటకు వెళ్లింది. ఈ లోగా ఏమైందో ఏమోగానీ వీరిద్దరూ విగతజీవులుగా కనిపించారు. భార్యభర్తల సమీపంలోనే కొడుకు ఏడుస్తూ కనిపించడంతో ప్రియాంక తల్లి కంగారుపడి పొరుగుంటివాళ్లను పిలిచి పోలీసులకు సమాచారమిచ్చింది. ఈ సమాచారం అందుకున్న నైట్ రౌండ్స్ క్రైం ఎస్ ఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. తొలుత ప్రియాంకకు ఉరి వేసి, ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక బలరాం ఉరి వేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దంపతులు కడు పేదరికంలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరి ఆత్మహత్యకు మరేమైనా కారణాలున్నాయా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఆత్మహత్యతో వారి నాలుగేళ్ల కుమారుడు అనాథైపోయాడని ప్రియాంక తల్లి రోధిస్తోంది.

## విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సూర్యప్రకాశ్ కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేసిన గద్దె క్రాంతి కుమార్



విజయవాడ, జూన్ 8 (నేటి శుభోదయ):- ఇటీవల ఫుడ్ కోర్టులో జరిగిన విషాద ఘటనలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన 18వ డివిజన్‌కు చెందిన పందిటి సూర్యప్రకాశ్ కుటుంబ సభ్యులను సోమవారం గద్దె క్రాంతి కుమార్ రాణిగారితోటలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సూర్యప్రకాశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సూర్యప్రకాష్ తండ్రి మురళికి లక్ష రూపాయల నగదును క్రాంతికుమార్ అందజేసారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి మాట్లాడుతూ కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన సూర్యప్రకాశ్ అకాల మరణంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సూచనల మేరకు సొంత నిధుల నుంచి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, ప్రభుత్వం తరపున కూడా తగిన సహాయం అందేలా కృషి చేస్తామని క్రాంతికుమార్ హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా బాధిత కుటుంబానికి పార్టీ తరపున, ప్రభుత్వం తరపున తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఇటువంటి అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ జీవిత బీమా (ఇన్సూరెన్స్) తీసుకోవడం అవసరమని సూచించారు. ఇన్సూరెన్స్ ఉంటే ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబాలకు కొంతైనా అండగా నిలుస్తుందని క్రాంతికుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొక్కెర తిరుపతయ్య, మైలామూరి ఫీరుబాబు, గొర్రిపర్తి నామేశ్వరరావు, తలపాటి ప్రసాద్, పగడాల వెంకటేశ్వర రెడ్డి, బలగాని శ్రీను, గోగుల ఏసుబాబు, అంబటి కాశీ, అంబడిపూడి దుర్గమ్మ, రెడ్డి మాలక్ష్మమ్మ, గోగుల గోపి, పత్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదం జరగకుండా ఖచ్చితంగా నివారణ చర్యలు పాటించాలి




విజయవాడ, జూన్ 8 (నేటి శుభోదయ):- విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, ఆదేశాల మేరకు వీఎంసీ రీజినల్ ఫైర్ ఆఫీసర్ రత్నబాబు ఆధ్వర్యంలో విజయవాడ ఎం.జి.రోడ్డులోని శుభమస్తు షాపింగ్ మాల్‌లో ఆకస్మిక అగ్నిమాపక భద్రతా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా భవనంలో పలు కీలక అగ్నిమాపక భద్రతా లోపాలు ఉన్నట్లు గుర్తించారు. భవనంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక భద్రతా పరికరాలు సక్రమంగా పనిచేయడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలు ఇనుప షీట్లతో పూర్తిగా మూసివేయబడి ఉండటంతో అవి అందుబాటులో లేవని అధికారులు గుర్తించారు. అలాగే భవనం నుంచి ప్రజలు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు అవసరమైన ప్రాంతాల్లో ఎగ్జిట్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, పొగను గుర్తించే స్మోక్ డిటెక్టర్లు సక్రమంగా పనిచేయకపోవడం వంటి లోపాలు కూడా వెలుగుచూశాయి. ఈ సందర్భంగా వీఎంసీ రీజినల్ ఫైర్ ఆఫీసర్ రత్నబాబు మాట్లాడుతూ, భవన యాజమాన్యాలు అగ్నిమాపక భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలు, కార్యాలయ భవనాల్లో అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండాలని, అత్యవసర నిష్క్రమణ మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయరాదని తెలిపారు. అగ్నిప్రమాదాల సమయంలో ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ అలారం వ్యవస్థలు, ఎగ్జిట్ సూచిక బోర్డులు తప్పనిసరిగా సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తనిఖీలలో గుర్తించిన లోపాలను మాల్ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి, ప్రజా భద్రత దృష్ట్యా అగ్నిమాపక భద్రతా నిబంధనలకు అనుగుణంగా అన్ని లోపాలను తక్షణమే సరిదిద్దాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. లోపాల సవరణలో నిర్లక్ష్యం ప్రదర్శించే యాజమాన్యాలపై అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా నగరంలోని అన్ని షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలు, ఇతర వాణిజ్య సంస్థలలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాల అమలుపై ఆకస్మిక తనిఖీలు నిరంతరం నిర్వహించబడతాయని, తనిఖీలలో ఏవైనా ఉల్లంఘనలు గుర్తించినట్లయితే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని రీజినల్ ఫైర్ ఆఫీసర్ రత్నబాబు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన వారి రౌడీ షీట్లు తొలగించుటకు పై అధికారులకు

### ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.



( నేటి శుభోదయ జూన్ : 08 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు పెందుర్తి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ కె.వి. సతీష్ కుమార్ వారు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రౌడీ షీటర్లకు చట్టబద్ధమైన జీవన విధానం, సామాజిక బాధ్యతలు మరియు శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వారు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి సమాజంలో మంచి పౌరుడిగా మారి, కుటుంబ సభ్యులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రజల్లో భయం, ఆందోళన కలిగించే ఎటువంటి అసాంఘిక లేదా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడినట్లయితే, వారి మీద కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే తప్పుదారి పట్టి జీవితాన్ని నాశనం చేసుకోవడం కంటే, సత్ప్రవర్తనతో ముందుకు సాగి స్వయంవికాసం సాధించుకోవడం ద్వారానే గౌరవప్రదమైన జీవితం పొందవచ్చని తెలిపారు. సమాజ శ్రేయస్సు, కుటుంబ అభివృద్ధి మరియు వ్యక్తిగత భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని కోరారు. మంచి ప్రవర్తనతో, ఎటువంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలలో పాల్గొనకుండా సక్రమంగా జీవిస్తున్న కొంతమంది రౌడీ షీటర్లను గుర్తించామని, వారి ప్రవర్తనను పరిశీలించి, అర్హులైన వారి రౌడీ షీట్లు తొలగించుటకు పై అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. మార్పు దిశగా ముందడుగు వేసిన వారిని పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. పోలీసు శాఖ ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇన్‌స్పెక్టర్ వారు విజ్ఞప్తి చేశారు.

# ఖమ్మం నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కొన్ని ప్రైవేట్ స్కూల్స్

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో అనేక చోట్ల నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలను నిర్వహిస్తున్నారు. అనేక చోట్ల ఉన్న పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ లేదు, విద్యార్థుల సంరక్షణ లేదు, మూడు నాలుగు అంతస్తు భవనంలో విద్యను బోధిస్తూ సేఫ్టీ పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే మీనా మీసాలు లెక్కిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఆ శాఖ అధికారులపై పలు అనుమానాలకు తావు ఇస్తోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా విధానం ఒకటే అయిన ఫీజులు మాత్రం ఇష్టానురాజ్యంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. అయినా కూడా నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ. కొన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ఇష్టానుసారంగా ప్రవర్తిస్తుంటారు. కనీసం తల్లిదండ్రులకు సైతం గౌరవ మర్యాదలు ఇవ్వని పరిస్థితి. ఖమ్మం నగరంలో ఇటీవల కాలంలో కార్పొరేట్ సంస్థలలో ఉన్న ఫీజులను వసూళ్లు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించే అవకాశం లేదు. తాము ప్రతికలకు యాడ్స్, రాజకీయ, స్టూడెంట్స్ యూనియన్ నేతలకు చందాలు ఇస్తున్నాం అని చెప్పడం కొసమెరుపు. ప్రవేట్ పాఠశాల వసూళ్లతో బెంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు. తల్లిదండ్రుల మేల్కోవాలి నిర్దిష్టమైన ప్రమాణాలను, నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలోనే మీ పిల్లలను చదివించాలి అని సూచిస్తున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను సైతం ఎక్కువ మార్కుల వచ్చినట్లుగా ప్రచారం కొనసాగిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న స్కూళ్లపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది మరి. ఇంకా మరిన్ని వివరాలతో త్వరలో రోజు వారి సంచికలో ప్రచురితం జరుగుతుంది.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదం

### కార్మికుల మృతికి ప్రభుత్వ వైఫల్యమే కారణం -- హాసిని వర్మ ఆగ్రహం



( నేటి శుభోదయ జూన్ : 09 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం చోటుచేసుకున్న హాట్ మెటల్ బకెట్ల కుప్పకూలి ఎనిమిది మంది కార్మికులు మృతి చెందిన ఘటనపై విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అడ్డాల వెంకట వర్మ రాజు (హాసిని వర్మ) తీవ్రంగా స్పందించారు. ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్లాంట్ భద్రతా ప్రమాణాల అమలులో వైఫల్యమే ప్రధాన కారణమని వర్మ రాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. "ద్రవ లోహం బకెట్లు కుప్పకూలి కార్మికులు ప్రాణాలు కోల్పోయారంటే ఇది కేవలం ప్రమాదం కాదు. నిత్యం ప్రాణాలకు తెగించి పనిచేసే కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం, ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించాయనడానికి ఇది స్పష్టమైన నిదర్శనం" అని ఆయన అన్నారు. భద్రతా తనిఖీలు గాలికొదిలేశారాహాట్ మెటల్ విభాగంలో ల్యాడిల్, బకెట్ల నిర్వహణ, సాంకేతిక తనిఖీలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా అని ప్రశ్నించిన హాసిని వర్మ, "కార్మికుల ప్రాణాలు పణంగా పెట్టి ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలనే ధోరణి ఇప్పటికైనా మానుకోవాలి. ప్రమాదానికి ముందు ఎలాంటి హెచ్చరికలు లేవా? నిర్వహణ లోపాలపై ముందే చర్యలు ఎందుకు తీసుకోలేదు" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మృతి చెందిన ఎనిమిది మంది కుటుంబాలకు తగిన నష్టపరిహారం, గాయపడిన వారికి ఉచిత వైద్యం అందించడంతో పాటు, ప్రమాదంపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణలో నిజాలు బయటపెట్టాలిస్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో, "లోపాయికారీ విచారణలు వద్దు. సాంకేతిక లోపమా, నిర్వహణ నిర్లక్ష్యమా అనేది ప్రజలకు తెలిసేలా పారదర్శకంగా నివేదిక విడుదల చేయాలి" అని హాసిని వర్మ స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికుల భద్రత కోసం కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు చేస్తుందని హాసిని వర్మ హెచ్చరించారు.

# బిజేపిలో చేరిన వైసీపి నేత సిల్ల ఈశ్వరరావు

### - కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేఎన్‌ఆర్



( నేటి శుభోదయ జూన్ : 09 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక హైస్కూలు రోడ్డులో నివాసం ఉంటున్న వైఎస్ఆర్ సీపీ నాయకుడు ప్రిన్స్ టైలర్స్ షాప్ ఓనర్ సిల్ల ఈశ్వరరావు బిజేపి లో చేరారు. వారికి నియోజకవర్గం ఇంచార్జ్ రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి. నరసింగరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ జిల్లా మీడియా పేనలిస్ట్ గూటూరు శంకరరావు,మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆహ్వానం మేరకు సోమవారం ఉదయం హైస్కూలు రోడ్డులో ఉన్న శంకర్రావు పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీలో చేరిన ఈశ్వరరావుకి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించామని అన్నారు. ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరానని అన్నారు. క్రమశిక్షణ గల పార్టీ కార్యకర్తగా , పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు, నియోజకవర్గం ఇంచార్జ్ కేఎన్ఆర్ మండల ఇంచార్జ్ శంకరరావు సూచనలు మేరకు నడుచుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కరకవలస దుర్గానాగరాజు ,కార్యదర్శి గోగుల లక్ష్మణస్వామి ఉపాధ్యక్షులు ఆలపాటి కాశీవిశ్వనాథం ఉపాధ్యక్షులు విఠల్ పటేల్ కార్యవర్గ సభ్యులు సింహాచలం నాయుడు,అమ్మతల్లినాయుడు,బాలకృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జన్మదినాన్ని ప్రాణదాన దినంగా మార్చిన వెంకి యూత్

### -- జూన్ 19న మెగా రక్తదాన శిబిరం"







( నేటి శుభోదయ జూన్ : 09 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఈ నెల జూన్ 19వ తేదీన జరగబోయే దివంగత ఈగల వెంకి నాయుడు వారి జన్మదినం సందర్భంగా, వందే బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో, వెంకి యూత్ అగనంపూడి నిర్వహణలో ఆయన జ్ఞాపకార్థం ఒక మెగా రక్తదాన శిబిరం నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. "మన మధ్య లేకపోయినా ఆయన జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆయన పుట్టినరోజు సందర్భంగా మరొకరికి ప్రాణదానం చేయాలనే మహోన్నత లక్ష్యంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నాము."ఈ సందర్భంగా అగనంపూడి గ్రామ యువత, వెంకి నాయుడు వారి స్నేహితులు, అభిమానులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాము. "ఒక యూనిట్ రక్తం… ఒక ప్రాణానికి కొత్త ఆశ. రక్తదానం మహాదానం… వెంకి నాయుడు వారి జ్ఞాపకార్థం చేసే ఈ రక్తదానం ఆయనకు నిజమైన నివాళి." వెంకి యూత్ అగనంపూడి

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ఘోర ప్రమాదం పై తీవ్ర దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

### - తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్



( నేటి శుభోదయ జూన్ : 09 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం పట్ల తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం, అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వాన్ని, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు.

# జాకబ్ గాప్ స్కూల్ లీలలు

- పర్మిషన్ నిల్, పైసల్ వసూల్ ఫుల్లు

తల్లిదండ్రుల జేబులకు చిల్లు

- నిద్రమత్తులో విద్యాశాఖ, ప్రశ్నించిన వారిని నోట్ల వర్షంతో నోరు మూపిస్తున్న యాజమాన్యం

- స్కూల్ ప్రారంభం కాకముందే వసూళ్ల పర్వానికి తెర తీసిన ప్రిన్సిపాల్

- ఫైర్ అయితే నో సేఫ్టీ , విద్యార్థుల ప్రాణాలకు రక్షణ ఏది

- అరకొర విద్యార్హతలు ఉన్న వారితోనే విద్యా బోధన

- తెలంగాణ సాంప్రదాయాన్ని గౌరవించని ప్రిన్సిపాల్

క్రిస్టియన్ మత ప్రచారమే ధ్యేయంగా పనిచేస్తున్న యాజమాన్యం



ఖమ్మం,బొనకల్లు, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా, బోనకల్ మండల పరిధిలోని బోనకల్ ప్రధాన రహదారికి సమీపంలో గత కొంతకాలంగా నిర్వహించబడుతున్న జాకప్ గాప్ స్కూల్లో పైసల వసూళ్ల పర్వం రోజురోజుకు మితిమీరి పోతుంది. ఎటువంటి సేఫ్టీ పద్ధతులను పాటించక పోయిన కూడా ఆ స్కూల్ నిర్వహించేందుకు మండల జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఏదో గ్రామాల్లో నిరక్షరాశులయిన తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకొని కొంతమంది పిఆర్ఓ ల ద్వారా స్కూల్లో విద్యార్థులను చేర్పించుకుంటున్నారు. విద్యాబోధన విషయంలో కూడా అరొకొర అర్హతలు ఉన్న వారితో విద్యాబోధనను నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఫైర్ సేఫ్టీ అసలే లేదు. మరి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ గీతాన్ని ప్రతిరోజు ప్రతిరోజు స్కూల్లో ఆలపించాలి కానీ అక్కడ ఉన్న ప్రిన్సిపాల్ మోనార్క్‌గా వ్యవహరిస్తూ ఎటువంటి నియమ నిబంధనలను పాటించకుండా ఇష్టాను రాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుకు విద్యార్థుల తల్లిదండ్రులు విసుగెత్తుతున్నారు.

# నేటి యువత క్రీడల పై దృష్టి సారించాలీ

### ముగిసిన వేసవి శిక్షణా తరగతులు



( నేటి శుభోదయ జూన్ : 09 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పెద గంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నడుపూరు హైస్కూల్ లో ప్రాచీన కాల విద్య కర్ర సాము మరియు కత్తి సాము టైక్వాండో పిల్లలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. క్యాంప్ ముగింపు లో భాగంగా పిల్లలకు టీ షర్టు , ప్రోటీన్ ఫుడ్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 74 వ వార్డు ఇంచార్జ్ పల్లా రమణ అంతర్జాతీయ "క్రీడాకారిణి గాజువాక బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి అండి బోయిన లక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముఖ్య అతిధులు పల్లా రమణ మాట్లాడుతూ క్రీడలు అనేవి పిల్లలు యొక్క ఎదుగుదలకు దోహదం చేస్తుంది. శరీరానికి దృఢత్వాన్ని ఇస్తుందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ముందుకి వెళ్లాలని ఇక్కడ అతిథిగా విచ్చేసి మన ఏరియాలో జన్మించి అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ ఉమెన్ గా మీ ముందు కూర్చున్న అండి బోయిన లక్ష్మి ను ఆదర్శంగా తీసుకొని ఆమె లాగా అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించాలని తెలియజేశారు. పిల్లలకు స్పోర్ట్స్ పరంగా కావలసిన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ముఖ్య అతిథి అండి బోయిన లక్ష్మి మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి వస్తున్న విద్యలు కర్ర సాము, కత్తి సాము ఇప్పుడున్న జనరేషన్లో మరుగున పడిపోతున్న ఈ కలలకు ప్రాణం పోస్తు ఈ విద్యలను సమ్మర్ క్యాంప్ పేరుతో మన నడుపురు హైస్కూల్లో గత నెల రోజుల నుంచి పిల్లలకు నేర్పిస్తున్న టీమ్ ను అభినందించారు. ఈ కాలంలో పిల్లలు ఇంటర్నెట్లకు సెల్ఫోన్లకు పరిమితమైపోవడం వలన అనేక అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. అలాకాకుండా గ్రౌండ్లకి వచ్చి ఇలాంటి విద్యలు నేర్చుకోవడం వల్ల ఇప్పుడున్న కాలంలో పెరిగిపోతున్న అనేక సమస్యల నుండి వారిని రక్షించుకొని ఆత్మరక్షణ చేసుకోగలగే సామర్థ్యం పిల్లల్లో పెరుగుతుందని అదేవిధంగా మెదడు చురుకుగా పనిచేసే చదువులో ముందుకు రాణించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉరుకుటి చందు, జిల్లా అధ్యక్షులు అండి బోయిన అప్పారావు, పులి రమణారెడ్డి, కిల్లాడి ముసలయ్య, పేర్ల సత్య రావు, కోచులు రాజు, గోపాలకృష్ణ, సత్యారావు పిల్లల తల్లితండ్రులు విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# దరిపల్లి అనంత రాములు కళాశాలలో ఎన్సీసీ విద్యార్థులకు 'బి' సర్టిఫికెట్ల ప్రదానం

### - శ్రీరంగం వరుణ్ త్రిలోక్ విద్యార్థికి జేఎయూఓ ర్యాంక్ ప్రదానోత్సవం




ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లాలోని దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్ ( ఇంజనీరింగ్, యం.బి.ఎ) (డేర్ కాలేజ్) లో ఎన్సీసీ విద్యార్థులకు 'బి' సర్టిఫికెట్ల ప్రదానోత్సవం, వరుణ్ త్రిలోక్ విద్యార్థికి జూనియర్ అండర్ ఆఫీసర్ (జేయుఓ) ర్యాంక్ ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎన్సీసీ శిక్షణను 2024-25, 2025-26 లలో జాయిన్ అయి విజయవంతంగా పూర్తి చేసిన జూనియర్, సీనియర్ విద్యార్థిని విద్యార్థులు శ్రీరంగం వరుణ్ త్రిలోక్ (డిప్లొమా మైనింగ్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), దేవనూరి సుమంత్(డిప్లొమా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), జూలూరి సౌమ్య (డిప్లొమా కంప్యూటర్స్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), పెద్దోజు స్పందన (డిప్లొమా కంప్యూటర్స్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), షేక్ హీనా హర్షద్ (డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), దాసరి రమ్య (డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్) లకు 'బి' సర్టిఫికెట్లను అందజేయగా, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ప్రతిభ కనబరిచిన శ్రీరంగం వరుణ్ త్రిలోక్ ఫైనల్ ఇయర్ మైనింగ్ విద్యార్థికి జూనియర్ అండర్ ఆఫీసర్ (జేయుఓ) ర్యాంక్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి దరిపల్లి విద్యా సంస్థల అధినేత మరియు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్సీసీ విద్యార్థుల్లో దేశభక్తి,



నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను, జేఎయూఓ ర్యాంక్ పొందిన విద్యార్థిని కళాశాల యాజమాన్యం అభినందించి వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి కేర్ టేకర్ ఆఫీసర్ మహేశ్వరం చిరంజీవి, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకాణి గోవర్ధన్ రెడ్డి గారితో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి భేటీ.



నెల్లూరు డైకాస్ రోడ్ లోని.. వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి గారితో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గారు..బేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి గారితో చంద్రశేఖర్ రెడ్డి గారు పలు విషయాలను చర్చించారు.

# చింతూరు తహాశీల్దార్ గా అర్జున్ రావు

చింతూరు, నేటి శుభోదయ :: చింతూరు తహసీల్దార్ గా గుబ్బల అర్జున రావు సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఏపీపీఎస్సీ 2018 గ్రూప్ 2 చెందినవారు. గతంలో పాలకొల్లు తహాశీల్దార్ ఆఫీస్ లోను, ప్రొఫెషనరీ డిప్యూటీ తాసిల్దార్ గా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు( రాజమండ్రి)లో పని చేశారు. పదోన్నతి పై చింతూరు తాసిల్దారుగా సోమవారం జాయిన్ అయ్యారు. గ్రూప్స్ రాక ముందు పోలీస్ కానిస్టేబుల్ గా పనిచేసినట్లు తెలిపారు.

# ఢిల్లీలో - ఇండియా బ్లాక్' కీలక సమావేశం




న్యూఢిల్లీ : ప్రతిపక్ష 'ఇండియా' బ్లాక్ సోమవారం న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైంది. వామపక్ష నేతలు జాన్ బ్రిట్టాస్, దీపాంకర్ భట్టాచార్య, పి. సంతోష్ కుమార్ సహా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా , పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, బీహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్ మాజీ సిఎం, టిఎంసి అధ్యక్షురాలు మమతా బెనర్జీ తో పాటు టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా సమావేశానికి హాజరయ్యారు. శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాకరే వర్చువల్ విధానంలో ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇటీవల తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టివికె)తో కాంగ్రెస్ చేతులు కలిపి, డిఎంకెతో ఉన్న దీర్ఘకాల భాగస్వామ్యానికి ముగింపు పలకడంతో .. ఈ సమావేశానికి స్టాలిన్ దూరంగా ఉన్నారు. అయితే, తమిళనాడుకు చెందిన విదుతలై చిరుతైగళ్ కచ్చి (వీసీకే) అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి) ఎంపీ ఎన్‌కె ప్రేమచంద్రన్ ఈ భేటీకి హాజరయ్యారు. ఇండియా బ్లాక్ సమావేశాన్ని చూసి బిజెపి భయపడుతోందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కె.సి.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. తనకు అటువంటి పోస్టర్లు కనిపించలేదని కొట్టిపారేశారు. బిజెపి రాజకీయ ఆధిపత్యాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు, కూటమిలోని అంతర్గత విభేదాల పరిష్కారానికి కూడా ఈ సమావేశం అత్యంత కీలకంగా మారనుంది. పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి ఓటమి తర్వాత ఈ భేటీ జరగడం గమనార్హం. కేరళ అసెంబ్లీ ఎన్నికల సమయంలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్ డి ఎఫ్)కు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను ఈ సమావేశంలో ఎండగడతామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు వామపక్షాలకు బిజెపితో పొత్తు ఉందంటూ కాంగ్రెస్ అధిష్టానం వ్యాఖ్యానించడం సరికాదని అన్నారు. పరస్పర గౌరవం, విశ్వాసం లేనప్పుడు ఐక్య ఉద్యమాన్ని నిర్మించడం సాధ్యం కాదని ఆయన అన్నారు. 'దేశాన్ని కాపాడండి, బిజెపి హటావో' అనే ఉమ్మడి లక్ష్యంతో ఏర్పడిన ఇండియా బ్లాక్ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తామని రాజా తెలిపారు. కేరళ ఎన్నికల సమయంలో తమ నాయకత్వంపై జరిగిన 'వ్యవస్థాగత ప్రచారం'పై సిపిఐ(ఎం) సైతం అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఇండియా బ్లాక్ ఐక్యతను కాపాడేందుకు ఎంపీ జాన్ బ్రిట్టాస్‌ను సమావేశానికి పంపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత నాయకుడు జైరామ్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ కీలక సమావేశానికి మొత్తం 23 రాజకీయ పార్టీలు హాజరవుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ పేర్కొన్నారు. పార్టీల మధ్య కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నాయనే ఊహాగానాలను కొట్టిపారేస్తూ.. ఇండియా బ్లాక్ ఐక్యంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# కిమ్‌తో జిన్‌పింగ్ చర్చలు



బీజింగ్ : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్-ఉన్‌తో చర్చలు జరిపేందుకు సోమవారం ప్యాంగ్‌యాంగ్‌కు చేరుకున్నారని చైనా జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరు నేతలు ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక స్నేహాన్ని కొనసాగించడానికి, ద్వైపాక్షిక సంబంధాలను మరింత అభివృద్ధి చేసే దిశలో చర్చలు జరగనున్నాయని జిన్హువా వార్తా సంస్థ వెల్లడించింది. దాదాపు ఈ ఏడేబీజింగ్ : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్-ఉన్‌తో చర్చలు జరిపేందుకు సోమవారం ప్యాంగ్‌యాంగ్‌కు చేరుకున్నారని చైనా జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరు నేతలు ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక స్నేహాన్ని కొనసాగించడానికి, ద్వైపాక్షిక సంబంధాలను మరింత అభివృద్ధి చేసే దిశలో చర్చలు జరగనున్నాయని జిన్హువా వార్తా సంస్థ వెల్లడించింది. దాదాపు ఈ ఏడేళ్లలో తొలిసారి జిన్‌పింగ్ ఉత్తరకొరియా పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2024లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తరకొరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరు నేతలు రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశారు. ళ్లలో తొలిసారి జిన్‌పింగ్ ఉత్తరకొరియా పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2024లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తరకొరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరు నేతలు రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశారు.

# టెలివిజన్ ఇంటర్వ్యూ మధ్యలోనే వెళ్లిపోయిన ట్రంప్..



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్ బి సి వారి -మీట్ ది ప్రెస్' టెలివిజన్ ఇంటర్వ్యూ నుండి మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. 2020 అధ్యక్ష ఎన్నికలపై ట్రంప్ చేసిన ఆరోపణలపై మోడరేటర్ క్రిస్టెన్ వెల్కర్ ఆధారాలు చూపించాలని కోరారు. దీంతో ట్రంప్ సమాధానమివ్వకుండా ఆగ్రహిస్తూ.. మైక్ ను విసిరిగొట్టి, మీడియా, యాంకర్ పై విరుచుకుపడ్డారు. మీడియా నిజాయితీ లేనిదని, నకిలీ, నీచమైన, వక్రబుద్ధి గల మీడియా అని, మీరు అవినీతిపరులే అంటూ అక్కడి నుండి విసురుగా వెళ్లిపోయారు.

వివరాల ప్రకారం.. ఎన్ బి సి ఛానెల్ లో ప్రసారమయ్యే మీట్ ది ప్రెస్ కార్యక్రమం కోసం యాంకర్ క్రిస్టెన్ వెల్కర్ ట్రంప్ ను ఇంటర్వ్యూ చేశారు. ఆయుధీకరణ నిరోధక నిధిని సమర్థిస్తూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఈ వివాదం ప్రారంభమైంది. ఇంటర్వ్యూలో ట్రంప్ 2020 ఎన్నికల్లో, కాలిఫోర్నియా ఎన్నికల్లో ఓట్ల లెక్కింపులో రిగ్గింగ్ జరిగిందని ట్రంప్ ఆరోపించారు. నాలుగు రోజులు గడిచినా ఫలితాలు వెల్లడించలేదని, ఎన్నికల్లో మోసం జరిగిందని అన్నారు. బైడెన్ ప్రభుత్వం అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు ఆయుధీకరణ నిరోధక నిధిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నిధి కోసం ఒక కమిటీని నియమిస్తామని, అందులో ఎవరైనా సభ్యులుగా ఉండవచ్చని అన్నారు. అన్యాయంగా చాలా మందిని జైలుకు పంపారని, వారి జీవితాలను నాశనం చేశారని అన్నారు. ఈ వాదనలను సమర్థించడానికి ఎటువంటి ఆధారాలు సమర్థించలేదని వెల్కర్ సవాలు చేశారు. తాత్కాలిక అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచే, ఆ నిధి భవిష్యత్తు గురించి ప్రశ్న అడుగుతుండగా.. ట్రంప్ అడ్డుపడ్డారు. బలమైన ఆధారాలు ఉన్నాయని, ఎన్నికల్లో మోసం జరిగిందని, అది అక్రమ ఎన్నిక అని అన్నారు. ఇప్పుడు కాలిఫోర్నియాలోనూ మళ్లీ ఇదే జరుగుతోందని అన్నారు. కాలిఫోర్నియాలో రిపబ్లికన్లు బాగా రాణిస్తున్నారని వెల్కర్ బదులిచ్చారు. ఎన్నికల్లో మోసం జరిగిందని, అది అక్రమ ఎన్నిక అని అన్నారు. ఎన్నికల అధికారులు, టెలివిజన్ నెట్ వర్క్, జర్నలిస్టులు నిజాయితీ పరులు కాదని ట్రంప్ ఆరోపించారు. మీట్ ది ప్రెస్ మోసపూరితమైనది, ఎబిసి, సిబిఎస్, సిఎన్ ఎన్ అన్నీ అవినీతిపరమైనవేనని, మీరు అవినీతిపరులే అంటూ మైక్రోఫోన్ ను తీసి ఇంటర్వ్యూ నుండి వెళ్లిపోయారు. ఈ ఇంటర్వ్యూ కోసం తాను విస్కాన్సిన్కు వచ్చానని ఇంటర్వ్యూ పూర్తి చేయాలని వెల్కర్ కోరారు. మీకు తగినంత సమయం ఇచ్చానని, మీరు పత్రికా రంగాన్ని సరిదిద్దు కోవాలని అక్కడి నుండి వెళ్లిపోయారు.

# గాడ్జిల్లా వచ్చేస్తోంది! భారత్‌పై దాని నీడ పడితే..

గాడ్జిల్లా సముద్రం నుంచి బయటకు వస్తే నగరాలు వణికిపోతాయి. ఎందుకంటే అది సృష్టించే విధ్వంసం కనీవినీ ఎరుగని రీతిలో ఉంటుంది. అది సినిమా కథ. కానీ ఇప్పుడు పసిఫిక్ మహాసముద్రంలో రూపుదిద్దుకుంటున్న 'గాడ్జిల్లా' మాత్రం సైంటిస్టులను సైతం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రపంచం మొత్తం దానివైపు చూస్తుంటే.. భారత్‌కు మాత్రం మరో భయం వెంటాడుతోంది. ఎందుకంటే ఈ దాని నీడ గనుక పడితే జరిగిన నష్టం.. పెను సంక్షోభానికి దారి తీస్తుంది కాబట్టి!. వాతావరణ ప్రపంచంలో ప్రస్తుతం ఒక్కటే చర్చ నడుస్తోంది. అదే "గాడ్జిల్లా ఎల్ నినో". సాధారణంగా రెండు నుంచి ఏడు సంవత్సరాలకు ఒకసారి కనిపించే ఎల్ నినో ఈసారి.. అసాధారణంగా బలపడే సంకేతాలు ఇస్తోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (ఐమీఓ), యూరప్‌కు చెందిన ప్రముఖ వాతావరణ అంచనా కేంద్రాలు విడుదల చేసిన తాజా నివేదికలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని నీటి ఉష్ణోగ్రతల్లో సంభవించే మార్పు. సాధారణంగా పసిఫిక్‌లో వీచే ట్రేడ్ విండ్స్ వేడి నీటిని ఆసియా వైపు నెట్టేస్తుంటాయి. కానీ ఎల్ నినో సమయంలో ఆ గాలులు బలహీనపడతాయి. ఫలితంగా వేడి నీరు మధ్య, తూర్పు పసిఫిక్ వైపు వ్యాపిస్తుంది. ఈ ఒక్క మార్పు ప్రపంచ వాతావరణ వ్యవస్థ మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా గమనించే "నినో-3.4" ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పటికే సాధారణం కంటే 0.9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. ఎల్ నినో ప్రకటించేందుకు అవసరమైన 0.5 డిగ్రీల పరిమితిని ఇది దాటేసింది. డిసెంబర్ నాటికి ఈ వ్యత్యాసం 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు చేరే అవకాశం ఉందని యూరోపియన్ ఫోర్‌కాస్ట్ మోడళ్లు సూచిస్తున్నాయి. అదే జరిగితే 1997-98, 2015-16 సూపర్ ఎల్ నినో రికార్డులు బద్దలయ్యే అవకాశం ఉంది. అందుకే దీనికి "గాడ్జిల్లా ఎల్ నినో" అనే పేరు పెట్టారు. గాడ్జిల్లాలా.. ఈ ఎల్ నినో కూడా ప్రపంచ వాతావరణ వ్యవస్థపై భారీ ప్రభావం చూపవచ్చని భావించి ఆ పేరు పెట్టారు.

భారత్‌పైనే ఎక్కువ ఎందుకు?

గాడ్జిల్లా ఎల్‌నినో గురించి భారత్ ఎక్కువగా ఆందోళన చెందడానికి బలమైన కారణాలే ఉన్నాయి. దేశంలో ఏడాది మొత్తం కురిసే వర్షాల్లో దాదాపు 70 శాతం నైరుతి రుతుపవనాల ద్వారానే వస్తుంది. వ్యవసాయ భూముల్లో సగానికి పైగా ఇప్పటికీ వర్షాధారంగానే సాగవుతున్నాయి. అందుకే వర్షాకాలంలో చిన్న మార్పు వచ్చినా దాని ప్రభావం కోట్లాది మంది రైతులు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై నేరుగా పడుతుంది. సాధారణంగా ఎల్‌నినో సమయంలో పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో



వర్షాలను తీసుకొచ్చే గాలి ప్రవాహాలు తూర్పు వైపుకు మళ్లుతాయి. దీంతో భారత ఉపఖండానికి చేరాల్సిన తేమ తగ్గిపోతుంది. ఫలితంగా రుతుపవనాలు బలహీనపడటం, సాధారణం కంటే తక్కువ వర్షాలు నమోదవడం జరుగుతుంది. ఇప్పటికే భారత వాతావరణ శాఖ ఈ ఏడాది వర్షపాతం సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉండొచ్చని అంచనా వేసింది. 1971-2020 మధ్యకాల సగటుతో పోలిస్తే ఈసారి కేవలం 90 శాతం వర్షపాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు, లోటు వర్షాలు నమోదయ్యే అవకాశం 60 శాతం వరకు ఉందని హెచ్చరించింది. అయితే సమస్య కేవలం వర్షాలు తగ్గడమే కాదు. వర్షాలు తగ్గితే ముందుగా దెబ్బతినేది వ్యవసాయ రంగం. వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాల వంటి పంటల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంటుంది. రైతుల ఆదాయం పడిపోవచ్చు. భూగర్భ జలాల నిల్వలు తగ్గవచ్చు. జలాశయాలు పూర్తిస్థాయిలో నిండకపోతే తాగునీటి, సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. దీని ప్రభావం చివరికి సాధారణ ప్రజలపై కూడా పడుతుంది. పంటల ఉత్పత్తి తగ్గితే కూరగాయలు, ధాన్యాలు, పప్పులు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఆహార ద్రవ్యోల్బణం పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపైనా ఒత్తిడి పెరుగుతుంది. అందుకే శాస్త్రవేత్తలు గాడ్జిల్లా ఎల్‌నినోను కేవలం వాతావరణ ఘటనగా కాకుండా.. వ్యవసాయం, ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే కీలక పరిణామంగా చూస్తున్నారు.

గతం ఏం చెబుతోందంటే..

1997-98లో ప్రపంచం అత్యంత శక్తివంతమైన ఎల్ నినోను చూసింది. 2015-16లో మరోసారి సూపర్ ఎల్ నినో నమోదైంది. ఆ సమయంలో భారత్‌లో సాధారణం కంటే కేవలం 86 శాతం వర్షపాతం మాత్రమే నమోదైంది. పలు రాష్ట్రాలు కరువు బారిన పడ్డాయి. వ్యవసాయ దిగుబడులు తగ్గాయి. ఆహార ద్రవ్యోల్బణం పెరిగింది. అయితే అప్పట్లో భారత్‌కు ఒక రక్షణ కవచం లభించింది. అదే ఇండియన్ ఓషన్ డైపోల్ . 1997లో బలమైన పాజిటివ్ ఐఓడి ప్రభావంతో ఎల్ నినో దెబ్బ కొంతవరకు తగ్గింది. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రస్తుతం ఐవోడీ తటస్థ స్థితిలోనే ఉండే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. అంటే ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించే సహజ మిత్రుడు ఈసారి భారత్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. ఎల్ నినోను భారత్ వర్షాకాలానికి విలన్‌గా భావిస్తే.. ఐవోడీని హీరోగా చెప్పొచ్చు. ఎల్ నినో వల్ల తగ్గే వర్షాలను కొంతవరకు భర్తీ చేసి, దేశాన్ని కరువు ముప్పు నుంచి కాపాడే శక్తి దీనికి ఉంటుంది. అదెలాగంటే.. ఎల్ నినో వల్ల భారత్‌లో వర్షాలు తగ్గే ప్రమాదం ఉంటుంది. అలాంటి సమయంలో భారత మహాసముద్రంలో ఏర్పడే ఐవోడీ వాతావరణ పరిస్థితి కొన్నిసార్లు రక్షకుడిలా పనిచేస్తుంది. ఇది అనుకూలంగా ఉంటే ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించి, భారత్‌కు అదనపు వర్షాలు కురిసేలా సహాయపడుతుంది.

ప్రపంచంపై ప్రభావం..

అలాగని గాడ్జిల్లా ఎల్ నినో ప్రభావం భారత్‌కే పరిమితం కాదు. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్‌లలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. కొన్ని ప్రాంతాల్లో అడవి మంటలు పెరిగే అవకాశం ఉంది. మరోవైపు అమెరికా, పెరూ, ఈక్వెడార్ వంటి దేశాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చు. ప్రపంచ ఆహార ఉత్పత్తి వ్యవస్థ కూడా దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పంట దిగుబడులు తగ్గితే ఆహార ధరలు పెరగవచ్చు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న సరఫరా సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

కరువు ఖాయమేనా?

కచ్చితంగా కాదు. ఎల్ నినో ఒక ప్రమాద సంకేతం మాత్రమే. అది తుది ఫలితం కాదు. వర్షాకాలాన్ని ప్రభావితం చేసే ఇతర అంశాలు కూడా ఉన్నాయి. స్థానిక వాతావరణ పరిస్థితులు, సముద్ర ఉష్ణోగ్రతలు, గాలి ప్రవాహాల తీరు వంటి అంశాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. అయినా సరే.. ప్రపంచ వాతావరణ నిపుణులు ఇప్పుడు పసిఫిక్‌పై ప్రత్యేక నిఘా పెట్టడానికి కారణం ఉంది. ఎందుకంటే ఇది సాధారణ ఎల్ నినో కాదనే సంకేతాలు కనిపిస్తుండడమే.

# ఆమె ప్రశ్నిస్తే ట్రంప్‌కే కాదు.. ఎవరికైనా చెమట్లు పట్టాల్సిందే!

ఇంటర్వ్యూల ఫార్మాట్ ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. సాధారణ ప్రశ్న.. జవాబుల కంటే కఠిన ప్రశ్నలతో సంచలనాలు రేపే సెషన్లు ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నాయి. అయితే ఎదురుగా డొనాల్డ్ ట్రంప్‌లాంటి నేతల ముందు అడుగు వేయడం అంటేనే చాలా మంది జర్నలిస్టులు జాగ్రత్తపడే పరిస్థితి. కానీ ఆ ఒత్తిడిని లెక్కచేయకుండా ధైర్యంగా కఠిన ప్రశ్నలు వేసిన ఒక జర్నలిస్ట్.. ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారారు. ఇక చాలూ అనుకుంటూ ఆయన్ని ఇంటర్వ్యూ మధ్యలోనే వాకౌట్ చేయించిన.. "ఆమె ఎవరబ్బా?" అనే ప్రశ్న జోరుగా వినిపిస్తోంది.. ఆమె పేరు.. క్రిస్టెన్ వెల్కర్. ఎన్‌బీసీ ఇంటర్వ్యూలో భాగంగా ఆమె ట్రంప్‌ను ఉక్కిరి బిక్కిరి చేశారు. ప్రధానంగా.. 2020 అధ్యక్ష ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగినట్లు ట్రంప్ చేసిన ఆరోపణలపై ఆమె ప్రశ్నలు సంధించారు. ఆధారాలు చూపాలంటూ ఆయన్ని పదే పదే ప్రశ్నించారు. అయితే ఆయన మాత్రం ఆ ప్రశ్నలకు నేరుగా సమాధానం ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారు. కానీ అదే అంశాన్ని ఆమె మళ్లీ మళ్లీ ప్రస్తావించడంతో ఇంటర్వ్యూ వాతావరణం క్రమంగా ఉద్రిక్తంగా మారింది. సారీ డార్లింగ్ అంటూనే.. తీవ్రంగా విమర్శిస్తూ ట్రంప్ విసుగ్గా కోటుకు ఉన్న లాపెల్ మైక్, వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్‌తో పాటే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన తర్వాత అమెరికా మీడియా ప్రపంచంలోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ ఒక్కసారిగా దృష్టి మొత్తం క్రిస్టెన్ వెల్కర్ వైపుకే మళ్లింది. క్రిస్టెన్ వెల్కర్ 1976 జూలై 1న అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే వార్తా రంగంపై ఆసక్తి పెంచుకున్న ఆమె, అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చరిత్రను అభ్యసించారు. అనంతరం జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకుని స్థానిక టెలివిజన్ ఛానళ్లలో రిపోర్టర్‌గా కెరీర్ ప్రారంభించారు. రిపోర్టింగ్‌లో చూపిన ప్రతిభతో 2010లో ఆమె ఎన్‌బీసీ న్యూస్‌లో చేరారు. అక్కడి నుంచి ఆమె ప్రయాణం వేగంగా ముందుకు సాగింది. వైట్‌హౌస్ కరస్పాండెంట్‌గా నియమితులైన ఆమె, అమెరికా అధ్యక్షుల విదేశీ పర్యటనలు, ఎన్నికలు, జాతీయ భద్రత వంటి అత్యంత కీలక అంశాలను కవర్ చేస్తూ ప్రత్యేక గుర్తింపు



సంపాదించారు. అయితే.. క్రిస్టెన్ వెల్కర్ పేరు అంతర్జాతీయ స్థాయిలో తొలిసారి పెద్దగా వినిపించింది 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో. అప్పటి ట్రంప్--బైడెన్ మధ్య జరిగిన చివరి ప్రత్యక్ష చర్చకు ఆమె సమన్వయకర్తగా వ్యవహరించారు. ఇద్దరు అభ్యర్థులను సమతుల్యంగా ప్రశ్నిస్తూ, చర్చను నియంత్రించిన తీరు ఆమెకు విస్తృత ప్రశంసలు తెచ్చిపెట్టింది. అమెరికాలో అత్యంత ప్రభావవంతమైన రాజకీయ చర్చా కార్యక్రమాల్లో ఒకటైన "మీట్ ద ప్రెస్"కు 2023లో ఆమె హోస్ట్‌గా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారు. ఈ కార్యక్రమానికి తొలి ఆఫ్రికన్-అమెరికన్ మహిళా హోస్ట్‌గా, రెండో మహిళా యాంకర్‌గా నిలిచి విశేష గుర్తింపు పొందారు. డొనాల్డ్ ట్రంప్‌ను ఆమె ఇంతకు ముందు చాలాసార్లు ఇంటర్వ్యూ చేశారు. ట్రంప్ మాత్రమే కాదు.. గతంలో బరాక్ ఒబామా, కమలా హ్యారిస్, జో బైడెన్.. ఇంకా పలువురు టాప్ డెమోక్రటిక్, రిపబ్లికన్ లీడర్‌లను ఆమె తనదైన శైలి ప్రశ్నలతో ఇబ్బంది పెట్టారు. ఆమె ప్రశ్నించే విధానం ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఎవరు అధికారంలో ఉన్నా వెనక్కి తగ్గకుండా ప్రశ్నలు వేయడం, సమాధానాల్లోని అస్పష్టతను వెంటనే గుర్తించి తిరిగి ప్రశ్నించడం ఆమె జర్నలిజం శైలి. స్పష్టమైన సమాధానం వచ్చే వరకు వెనక్కి తగ్గకపోవడం వల్లే ఆమెను అమెరికా రాజకీయ జర్నలిజంలో అత్యంత ప్రభావవంతమైన జర్నలిస్టులలో ఒకరిగా భావిస్తారు. తాజా ఘటనతో మరోసారి ఆమె పేరు.. తీరు ప్రపంచవ్యాప్తంగా చర్చలోకి వచ్చింది.

# కృత్రిమ మాయలో మనిషి

'కృత్రిమ మేధ'గా మనం చెప్పుకునే 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) 'కపటి' అనే అర్థంలో నిజంగానే కృత్రిమంగా మారి ప్రపంచాన్ని భయపెడుతోంది. తెలుగులో 'నకిలీ తెలివి' లాంటి మాటల్ని వెతుక్కునే లోపలే అది నకిలీ విన్యాసాలలో చిత్రవిచిత్రమైన లోతులు చూస్తోంది. ఒక చేత్తో సానుకూలపు పూల బాణాలనూ, ఇంకోచేత్తో ప్రతికూలపు వాడిబాణాలనూ ప్రయోగిస్తూ జనాన్ని ఏకకాలంలో మోహపారవశ్యంలోనూ, భయవిభ్రమాల్లోనూ ముంచెత్తుతోంది. అనుకూల ఫలితాలపై ఆశపడుతూనే, ప్రతికూల ప్రభావాలనుంచి తప్పించుకునే మార్గాల వేటలో ప్రపంచం తలమునకలవుతోంది. భారత్, చైనా, రష్యా సహా పది దేశాలు సభ్యులుగా ఉన్న 'బ్రిక్స్' కూటమి కృత్రిమ మేధో వినియోగంలో, అభివృద్ధిలో, దానితో ముడిపడిన నైతిక సమస్యల నివారణలో, మేధో హక్కులూ, డేటా పరిరక్షణలో కలసి పనిచేసే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా, సాంస్కృతిక రంగంలో కృత్రిమ మేధో దుర్వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో వర్కింగ్ గ్రూప్ సమావేశాలు జరుపుతోంది; ఒక సమావేశానికి ప్రపంచ పురాతన నగరాలలో ఒకటైన వారణాసి వేదిక కాబోతోంది. కృత్రిమ మేధ ఏం చేస్తోందంటే, ఒక సాంకేతిక మహాద్భుతంగా మాయామేయ మాంత్రిక జగత్తును సృష్టిస్తూ పురాణ, ఇతిహాస, జానపద కథల కాలంలోకి తీసుకెడుతోంది. రామాయణంలో భర్త శాపానికి గురై అహల్య శిలగా మారిపోవడం, రాముని పాదాలు తాకగానే పూర్వరూపం తెచ్చుకోవడం గురించి చదివాం; 'జగదేకవీరుని కథ' సినిమాలో జలక్రీడలాడుతున్న దేవకన్యలను చూసిన పాపానికి వారి శాపానికి ఎరై కథానాయకుడు శిలగా మారిపోవడం, ఒక వృద్ధ మహిళ అతనికి శాపవిముక్తి కలిగించడం చూశాం. త్రిశంకుని స్వర్గానికి పంపించే ప్రయత్నంలో అతణ్ణి మధ్యలోనే స్తంభింపజేసి 'త్రిశంకు స్వర్గా'న్ని సృష్టించిన విశ్వామిత్రుని పునఃసృష్టి పాటవాన్ని కథల్లో దర్శించాం. రామాయణంలో ఇంద్రజిత్తు చేసే మబ్బుచాటు మాయావి యుద్ధాన్నీ, మహాభారతంలో సైంధవుని వధ సందర్భంలో కృష్ణుడు చక్రం అడ్డేసి కృత్రిమ సూర్యాస్తమయాన్ని సృష్టించడాన్నీ తిలకించాం. తన అర్ధాంగి పార్వతి అభ్యంగన స్నానానికి వెడుతూ నలుగుపిండి నుంచి సృష్టించి కాపలాపెట్టిన బాలుడు తనను అడ్డగించినందుకు శివుడు ఆగ్రహించి అతని శిరస్సును ఖండించడం; నిజం తెలిసి అతనికి ఏనుగు తలను



అతికించి, బతికించడం గురించి విన్నాం. తలలు తీసి తలలు పెట్టడంతో సహా కృత్రిమ మేధ ఇలాంటి చిత్రవిచిత్ర సన్నివేశాలను అవలీలగా సృష్టించగలుగుతోంది. అవి కపటత్వపు అంచులు తాకుతూ ప్రసిద్ధ వ్యక్తుల శీలహననానికి పాల్పడుతూ వివాదాస్పదమవుతున్నాయి; నిజమో, అబద్ధమో తెలియని త్రిశంకు స్థితికి జనాన్ని నెడుతున్నాయి. రాజకీయ నాయకులు, సినీనటులతో సహా ప్రముఖుల రూపాలనూ, గొంతులనూ వాడుకుంటూ అభ్యంతరకర సన్నివేశాలను సృష్టించడం, వారు న్యాయస్థానాలను ఆశ్రయించడం చూస్తున్నాం. పూర్తి సాంకేతిక నైపుణ్యాలూ, సాంకేతికతను బాధ్యతాయుతంగా వాడుకోవాలనే స్పృహ లేనివారికి కూడా కృత్రిమ మేధ అందుబాటులోకి రావడం వల్ల తలెత్తే ఇలాంటి వైపరీత్యాలతో కూడా పురాణ, ఇతిహాస కథలతో పోలిక కుదరడం మరో వైచిత్రి. ఉదాహరణకు, మహాభారతంలోని అశ్వత్థామతో ముడిపడిన ఒక ఉదంతాన్నే చూస్తే, కురుక్షేత్ర యుద్ధాంతంలో అతను ఉపపాండవులను వధించి పారిపోయినప్పుడు అతణ్ణి పట్టుకోవడానికి భీముడు బయలుదేరివెడతాడు; అశ్వత్థామ క్రూరుడనీ, చపలచిత్తుడనీ; అతని దగ్గర 'బ్రహ్మశిరోనామక'మనే దివ్యాస్త్రం ఉందనీ, దాని ప్రయోగమే తప్ప ఉపసంహారం అతనికి తెలియదనీ కృష్ణుడు అర్జునుడితో చెప్పి భీముని కాపాడుకోవడానికి తక్షణమే వెళ్ళాలంటాడు; ఊహించినట్టే అశ్వత్థామ దానిని ప్రయోగించడం, ప్రయోగోపసంహారాలు రెండూ తెలిసిన అర్జునుడు అదే అస్త్రంతో దానిని శాంతింపచేయబోవడం చూస్తాం. మనిషి-- తన మేధ సృష్టించిన కృత్రిమ మేధముందు తనే చిత్తవుతున్నాడు. మాంత్రికతనుంచి వాస్తవికతవైపు వెడుతున్న భ్రమలో ఉన్న మనిషిని కృత్రిమ మేధ తిరిగి మాంత్రికతవైపు మళ్ళిస్తూ పైచేయిని చాటుకుంటోంది. తను సృష్టించిన సాంకేతికత చేతిలో తనే ఓడి దిక్కులు చూసే పరిస్థితిని తెచ్చుకోవడం మనిషిని తొలినుంచి వెంటాడుతున్న శాపం.

# చేతిలో ఫోన్.. చేరని నెట్

**95.1% కుటుంబాల వద్ద హ్యాండ్‌సెట్స్**
**కానీ 'ఆఫ్‌లైన్' లోనే 27.5% కుటుంబాలు**
**డిజిటల్ సేవల్లో అసమానతలు**
**ఎన్‌సీఏఈఆర్–టీక్యూహెచ్ అధ్యయనంలో వెల్లడి**

న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ విప్లవం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, డిజిటల్ అవకాశాలు, సేవలు అందరికీ సమానంగా అందడం లేదని తాజా అధ్యయనంలో వెల్లడైంది. దేశంలోని 95.1% కుటుంబాలకు మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే 27.5 శాతం కుటుంబాలకు ఇప్పటికీ ఇంటర్నెట్ సదుపాయం లేవు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్), ది క్వాంటమ్ హబ్ (టీక్యూహెచ్) భాగస్వామ్యంతో రూపొందించిన 'ది ఎవాల్వింగ్ ల్యాండ్‌స్కేప్ ఆఫ్ డిజిటల్ ఇన్‌క్లూజన్ ఇన్ ఇండియా' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2022--24 మధ్య దేశవ్యాప్తంగా 47 వేలకుపైగా కుటుంబాలపై నిర్వహించిన ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే (ఐహెచ్‌డీఎస్--3) ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

### దశాబ్దపు వృద్ధి వెనుక అంతరాలు ..

భారత్‌లో గత దశాబ్దపు కాలంలో డిజిటల్ విస్తరణ గణనీయంగా సాగింది. చౌకైన స్మార్ట్‌ఫోన్లు, తక్కువ ధరకే లభించే డేటా ప్లాన్లు, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణతో 2015లో కేవలం 19.8 కోట్లుగా ఉన్న ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 2025 నాటికి 103 కోట్లకు పైగా పెరిగింది. అయితే, ఈ అద్భుతమైన వృద్ధి వెనుక



అసమానతలు దాగి ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ నాణ్యత, ప్రజలు వాడుతున్న పరికరాలు (డివైసెస్), వారి డిజిటల్ నైపుణ్యాలలో వ్యత్యాసాలు ఉన్నాయి. అలాగే విద్య, ఆర్థిక సేవలు, ఉపాధి,ప్రభుత్వసేవలు, సామాజిక భాగస్వామ్యంలో డిజిటల్ సాంకేతికత వినియోగంలో గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నట్లు వెల్లడించింది

### సదుపాయం కాదు నైపుణ్యాలు కీలకం

"కేవలం ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్నంత మాత్రాన ప్రజలకు డిజిటల్ సామర్థ్యం వచ్చేసినట్లు కాదు. డిజిటల్ అభివృద్ధి తదుపరి దశలో మౌలిక వసతుల విస్తరణతో పాటు ప్రజల్లో డిజిటల్ నైపుణ్యాల పెంపు, ప్రాంతీయ భాషలకు అనుగుణమైన డిజిటల్ సేవల రూపకల్పన, లింగ వివక్షను తగ్గించడంపై దృష్టి సారించాలి" అని ది క్వాంటమ్ హబ్ కో--ఫౌండర్ అపరాజిత భారతి తెలిపారు.

### నివేదికలో మరిన్ని ముఖ్యాంశాలు

కుటుంబాల ఆర్థిక స్థితిని బట్టి మొబైల్ ఫోన్ల సంఖ్యలో తేడాలు కనిపిస్తున్నాయి. అత్యంత పేద కుటుంబాల్లో సగటున 1.5 మొబైల్ ఫోన్లు ఉండగా, సంపన్న కుటుంబాల్లో ఈ సంఖ్య 2.9గా ఉంటోంది. దేశంలో 71.4 శాతం కుటుంబాలు మొబైల్ పరికరాల ద్వారానే ఇంటర్నెట్‌ను వినియోగిస్తుండగా, 27.5 శాతం కుటుంబాలకు ఇప్పటికీ ఎలాంటి ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో లేదు. డిజిటల్ సేవలను వినియోగించడంలో పురుషులు, మహిళల మధ్య అంతరాలు కొనసాగుతున్నాయి. డిజిటల్ సేవల వినియోగంలో పురుషులతో పోలిస్తే మహిళలు ఇంకా వెనుకబడే ఉన్నారు. పని చేసే వయసున్న పురుషుల్లో 57.6 శాతం మంది ఇంటర్నెట్ వాడుతుండగా, మహిళల్లో ఇది కేవలం 35.6 శాతంగానే నమోదైంది. డిజిటల్ సేవలు వినియోగిస్తున్న ప్రతి ఐదు కుటుంబాల్లో ఒక కుటుంబం (20.4 శాతం) ఆన్‌లైన్ అవసరాల కోసం కుటుంబం వెలుపలి వ్యక్తుల సహాయంపై ఆధారపడుతున్నట్లు నివేదిక వెల్లడించింది. అసలు చదువు లేని కుటుంబాల్లో ఈ ఆధారపడే పరిస్థితి దాదాపు 30 శాతంగా ఉంది. అంటే, చాలా మందికి ఇంటర్నెట్ అనేది స్వతంత్రంగా వాడుకునే సాధనంగా కాకుండా, ఎవరో ఒకరి మధ్యవర్తిత్వంతో నడిచే సేవగా మిగిలిపోయింది.

# ఏఐ దాహం.. ప్రపంచానికి కొత్త సవాల్!




కృత్రిమ మేధస్సు సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు కారణమవుతోంది. విద్య, వైద్యం, పరిశ్రమలు, రవాణా, వినోదం వంటి అనేక రంగాల్లో ఏఐ వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. అయితే.. ఈ అభివృద్ధి వెనుక సమస్యలు కూడా ఉన్నాయని, ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాల కంటే.. దాని కోసం అవసరమయ్యే నీరు, విద్యుత్, భూమి వినియోగం భవిష్యత్తులో పెద్ద సవాలుగా మారవచ్చని యూఎన్‌యూ హెచ్చరించింది. ఏఐ వ్యవస్థలు పనిచేయడానికి భారీ డేటా సెంటర్లు అవసరం. ఈ డేటా సెంటర్లలో వేలాది సర్వర్లు నిరంతరం పనిచేస్తుంటాయి. దీంతో సర్వర్లు అధిక ఉష్ణోగ్రతలకు లోనవుతాయి. అలాంటప్పుడు వీటిని చల్లబరచడానికి భారీ మొత్తంలో నీరు అవసరమవుతుంది.

### భారీ నీటి వినియోగం!

యూఎన్‌యూ నివేదిక ప్రకారం.. 2030 నాటికి ఏఐ డేటా సెంటర్లు వినియోగించే నీరు, ప్రపంచంలోని 1.3 బిలియన్ మంది ప్రజల ప్రాథమిక గృహ అవసరాలను తీర్చగల స్థాయిలో ఉండవచ్చని అంచనా. ఇది ప్రస్తుతం మొత్తం ఆఫ్రికా ఖండ జనాభాకు సమానం అని తెలుస్తోంది.

ఇప్పటి వరకు ఏఐ గురించి జరిగిన చర్చల్లో కార్బన్ ఉద్గారాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. కానీ నీటి వినియోగం కూడా అంతే ముఖ్యమైన సమస్యగా మారుతోందని పరిశోధకులు చెబుతున్నారు. ఏఐ మోడళ్లను నడపడానికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియలోనూ, సర్వర్ల శీతలీకరణలోనూ భారీ స్థాయిలో నీటి వినియోగం ఉంటుంది.

### విద్యుత్ వినియోగం

విద్యుత్ వినియోగం విషయంలో కూడా.. పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. 2030 నాటికి ఏఐ ఆధారిత డేటా సెంటర్లు ప్రతి సంవత్సరం సుమారు 945 టెరావాట్ గంటల విద్యుత్‌ను వినియోగించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఇది పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియా దేశాల వార్షిక విద్యుత్ వినియోగాన్ని కలిపినా వచ్చే మొత్తానికి దాదాపు మూడు రెట్లు ఎక్కువ. ఏఐ అనేది కేవలం డిజిటల్ సాంకేతికత మాత్రమే కాదని నివేదిక స్పష్టం చేసింది. దీనికి అత్యాధునిక కంప్యూటర్ చిప్స్, భారీ డేటా సెంటర్లు, శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ మౌలిక సదుపాయాలు అవసరం. ఇవన్నీ భూమి వనరులపై గణనీయమైన ఒత్తిడిని కలిగిస్తాయి. డేటా సెంటర్ల నిర్మాణం కోసం విస్తారమైన భూభాగం అవసరమవుతుంది. అదనంగా చిప్‌ల తయారీ ప్రక్రియలో కూడా విలువైన ఖనిజాలు, నీరు, పవర్ పెద్ద మొత్తంలో వినియోగించాల్సి ఉంటుంది.

### పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలు

అయితే.. ఇక్కడ ఐక్యరాజ్యసమితి ఏఐ అభివృద్ధిని నిలిపివేయాలని సూచించడం లేదు. బదులుగా ప్రభుత్వాలు, టెక్నాలజీ సంస్థలు, వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతోంది. కొత్త ఆవిష్కరణలతో పాటు నీటి వినియోగం, విద్యుత్ అవసరాలు, భూమి వినియోగం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తోంది.

ఏఐ మానవ జీవితాన్ని సులభతరం చేస్తున్నప్పటికీ దాని వెనుక దాగి ఉన్న పర్యావరణ వ్యయాన్ని విస్మరించకూడదు. భవిష్యత్తులో సాంకేతిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను సాధించడం ప్రపంచ దేశాల ముందున్న ప్రధాన సవాలు. కాబట్టి ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలను ఆస్వాదిస్తూనే, దాని పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే మార్గాలను అన్వేషించడం చాలా అవసరం.

# ఏఐ ఏజెంట్ వస్తోంది..



సెంట్రల్ డెస్క్: స్మార్ట్‌ఫోన్ మార్కెట్ ఒక చరిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. ఇకపై వినియోగదారులు మొబైల్ అప్లికేషన్ల (యాప్స్) ద్వారా కాకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఏజెంట్ల ద్వారా నేరుగా తమ డివైస్‌లతో ఇంటరాక్ట్ అయ్యే రోజులు రానున్నాయి. ఈ సరికొత్త ఏజెంటిక్ విప్లవంలో పైచేయి సాధించేందుకు టెక్ దిగ్గజాలు గూగుల్, ఓపెన్ ఏఐ హోరాహోరీగా తలపడుతున్నాయి.

### ఆండ్రాయిడ్ ఇక ఏఐ సిస్టమ్

గూగుల్ తాజాగా నిర్వహించిన ఆండ్రాయిడ్ షో 2026 వేదికగా గూగుల్ జెమినై ఇంటెలిజెన్స్‌ను అధికారికంగా ఆవిష్కరించింది. ఇది ఆండ్రాయిడ్ ఓఎస్ కోసం రూపొందించిన ఒక శక్తివంతమైన ఏఐ లేయర్. కేవలం ఒక ఆపరేటింగ్ సిస్టమ్‌గా ఉన్న ఆండ్రాయిడ్‌ను, పూర్తిస్థాయి ఇంటెలిజెన్స్ సిస్టమ్‌గా మార్చడమే దీని లక్ష్యమని గూగుల్ ప్రకటించింది. వినియోగదారుడి అవసరాలను, సందర్భాన్ని ముందే ఊహించి, వివిధ యాప్‌ల ద్వారా పనులను ఇది స్వయంచాలకంగా పూర్తి చేస్తుంది. ఈ ఏడాది చివర్లో మార్కెట్లోకి రానున్న శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్26, గూగుల్ పిక్సెల్ 10 సిరీస్ ఫోన్లలో ఈ ఫీచర్లు తొలిసారిగా అందుబాటులోకి రానున్నాయి.

### రూ. 53 వేల కోట్ల డీల్‌తో ఓపెన్ ఏఐ భారీ వ్యూహం

మరోవైపు యాపిల్ మాజీ ఐకానిక్ డిజైనర్ జోనీ ఐవ్‌తో కలిసి ఓపెన్ ఏఐ ఒక సరికొత్త ఏఐ--కేంద్రిత స్మార్ట్‌ఫోన్‌ను రికార్డు స్థాయిలో అభివృద్ధి చేస్తోంది. కంప్యూటింగ్ ప్రపంచాన్ని పూర్తిగా పునర్నిర్వచించే లక్ష్యంతో స్క్రీన్‌లు, సంప్రదాయ యాప్‌ల అవసరం లేకుండా కేవలం ఏఐ ఇంటరాక్షన్‌తో నడిచే సరికొత్త డివైస్‌లను రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా జోనీ ఐవ్‌కు చెందిన స్టార్టప్ 'ఐఓ'ను ఓపెన్ ఏఐ సంస్థ మునుపెన్నడూ లేని విధంగా సుమారు రూ. 53 వేల కోట్ల భారీ డీల్‌తో కైవసం చేసుకుంది. హార్డ్‌వేర్ రంగంలో ఓపెన్ ఏఐ వేసిన అతిపెద్ద అడుగుగా ఇది నిలిచింది.స్క్రీన్ ట్యాపింగ్, స్వైపింగ్ ఇక గతం

### ఇటీవల ప్రచురితమైన యాప్ ఏజెంట్

మల్టీమోడల్ ఏజెంట్స్ యాజ్ స్మార్ట్‌ఫోన్ యూజర్స్ అనే పరిశోధనా పత్రం ప్రకారం ఏఐ ఏజెంట్లు మనుషుల తరహాలోనే స్క్రీన్‌పై ట్యాప్ చేయడం, స్వైప్ చేయడం ద్వారా యాప్‌లను స్వతంత్రంగా ఆపరేట్ చేయగల సామర్థ్యాన్ని సాధించాయి. కిరాణా సామగ్రి ఆర్డర్ చేయడం, దరఖాస్తులు నింపడం, అపాయింట్‌మెంట్‌లు బుక్ చేయడం వంటి పనులను ఈ ఏజెంట్లు వినియోగదారుడి ప్రమేయం లేకుండానే పూర్తి చేయగలవు.

### ముఖ్యమైన మార్పులు ఇవీ..

**పూర్తి ఆటోమేషన్: ఒకే ఒక కమాండ్‌తో మల్టీ--స్టెప్ పనులను పూర్తి చేయగల ఏఐ.**

**కాంటెక్స్ట్ అవేర్‌నెస్: యూజర్ లొకేషన్, బిహేవియర్, ఆన్--స్క్రీన్ యాక్టివిటీ ఆధారంగా ముందస్తు సూచనలు.**

**పరిధి విస్తరణ: ఫోన్లకే పరిమితం కాకుండా భవిష్యత్తులో స్మార్ట్ వాచీలు, కార్లు, ల్యాప్‌టాప్‌లలోకి జెమిని ఇంటెలిజెన్స్.**

### భారత్‌పై ప్రభావం!

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్ అయిన భారతదేశంపై ఈ మార్పు తీవ్ర ప్రభావం చూపనుంది. దేశంలో ఆండ్రాయిడ్ మార్కెట్ వాటా అత్యధికంగా ఉండటమే కాకుండా శామ్‌సంగ్, షావోమి, వన్‌ప్లస్ వంటి బ్రాండ్ల ద్వారా ఏఐ ఫోన్లకు భారత్ అత్యంత కీలకమైన వృద్ధి కేంద్రంగా మారింది. వచ్చే వారం జరగబోయే అత్యంత ప్రతిష్ఠాత్మక గూగుల్ ఐ/ఓ 2026 సదస్సులో ఆండ్రాయిడ్ 17, జెమినై ఏఐ, ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్ డివైస్‌లకు సంబంధించిన మరిన్ని సంచలన అప్‌డేట్‌లను గూగుల్ ప్రకటించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# జెన్ జెడ్.. కొత్త పాఠాలు

- అప్పులంటే ఇష్టం లేదు... డెబిట్ కార్డుకే ప్రాధాన్యం
- ఖర్చులకైనా, సలహాలకైనా డిజిటల్ వేదికలే శరణ్యం
- చిన్నవయసు నుంచే పొదుపు... లాంగ్‌టర్మ్ లాభాలు
- మరోవైపు చూస్తే... తెలియని ఖర్చులూ ఎక్కువే
- సబ్‌స్క్రిప్షన్లు, వీకెండ్ షాపింగ్, నిరంతరం ఆర్డర్లు
- డిజిటల్ లావాదేవీలతో నిరంతరం ఖర్చులు
- 'బై నౌ.. పే లేటర్'కు మొగ్గు... తెలీకుండానే ట్రాప్‌లోకి
- కొందరు ఫిన్‌ఫ్లుయెన్సర్ల తప్పుడు సలహాలతో డేంజర్‌లోకి
- ఇవన్నీ నియంత్రించుకుంటే కొత్త ఎకానమీకి వీళ్లే ఆయువు



అప్పులంటే ఇష్టం లేదు. కానీ... ఈజీగా 'ఇదిగో తీసుకో' అంటూ వచ్చే మెసేజీలకు ఇట్టే ఆకర్షితులైపోతారు. అదుపులేకుండా వాడేస్తారు. ఎక్కడ పెట్టుబడి పెడితే ఏమవుతుందో సొంతగానే విశ్లేషిస్తారు. తమకు అన్నీ తెలుసనుకుంటారు. కానీ... రీల్స్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్లను ఇట్టే నమ్మేస్తారు. ఖర్చుల్ని నియంత్రణలో ఉంచుకోవాలనుకుంటారు. కానీ స్మార్ట్‌ఫోన్‌లో వేగంగా జరిపే లావాదేవీలతో... డబ్బు నిరంతరం ఖర్చవుతూనే ఉంటుంది. ముందే పొదుపు ఆరంభిస్తున్నారు. చిన్నచిన్న డిస్కౌంట్లు, ఆఫర్లకన్నా... పారదర్శకంగా చార్జీలు వసూలు చేసే సంస్థలనే నమ్ముతున్నారు. స్మార్ట్ ఫోన్లలో వాడే అప్లికేషన్ల నుంచీ ఎంటర్‌టైన్‌మెంట్ వరకూ సబ్‌స్క్రిప్షన్లు ఎక్కువ. ఎప్పటికప్పుడు కొత్త గాడ్జెట్లు, లైఫ్ స్టైల్‌ను అప్‌గేడ్ చేసుకోవటం అలవాటు. ఇదంతా 'జెడ్' జనరేషన్ గురించి. 16 ఏళ్లు దాటి... 30 ఏళ్లు నిండని యువతరం గురించి. వీరి అలవాట్లు కొన్ని మంచివే అయినా... కొన్నింటి విషయంలో జాగ్రత్తపడాల్సిందే. 2030 నాటికి జెన్ జెడ్, యువ మిలీనియల్స్ దేశీ వినియోగ వ్యయాల్లో మెజారిటీ వాటాకు చేరుతున్న నేపథ్యంలో... వీళ్లేం చేస్తున్నారో... ఏం చేస్తే బాగుంటుందో చెప్పే 'సాక్షి వెల్త్' స్టోరీ ఇది. పదేళ్ల కిందటి వరకూ పర్సులో డబ్బులు లేకుండా కదలడమనేది ఊహక్కూడా అందేది కాదు. కానీ ఇప్పటి జెన్ జెడ్.. చేతిలో స్మార్ట్‌ఫోన్ తప్ప మరేదీ వెంట తీసుకెళ్లడం లేదు. యూపీఐ సహా డిజిటల్ లావాదేవీలు సర్వ సాధారణమైపోవటమే ప్రధాన కారణం. క్యాష్‌తో సౌకర్యం తక్కువని భావించటం వల్ల కూడా దీనిపై ఆధారపడటం తగ్గుతోంది. మరో గమనించదగ్గ అంశమేంటంటే ఈ తరం క్రెడిట్ కార్డులకు తక్కువ ప్రాధాన్యమివ్వటం. యూపీఐ, మొబైల్ వాలెట్స్, డెబిట్ కార్డులనే ఎక్కువ వాడటం. క్యాష్‌ని అత్యంత తక్కువగా ఉపయోగిస్తున్నారు. పేమెంట్ మెథడ్ ఎంత సింపుల్‌గా ఉంటే అంత మంచిదనుకుంటున్నారు. పాత తరం వారు నెలవారీగా కొనుగోళ్లు, పండగ షాపింగ్‌లు జరుపుతుంటే... ఈ జెన్ జెడ్ మాత్రం వీకెండ్ షాపింగ్‌లే కాకుండా దాదాపు నిరంతరం ఖర్చు చేస్తూనే ఉన్నారు. క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ, క్యాబ్ సర్వీసులు, ఓటీటీ మెంబర్‌షిప్‌లు, గేమింగ్ సబ్?రస్క్రిప్షన్లు.. ఇలా ఒకటి కాదు నిత్యం బోలెడన్ని చిన్న చిన్న లావాదేవీలు చేస్తూనే ఉంటున్నారు. ఇలా వీరి ఖాతాల్లోంచి నిరంతరం ప్రవహిస్తున్న నగదు ఆధారంగా... ఇపుడొక కొత్త 'రియల్ టైమ్ స్పెండింగ్ ఎకానమీ' పుట్టుకొచ్చింది. అది అంతకంతకూ పెరుగుతోంది.

### అప్పంటే ఇష్టం లేదు.. కానీ..

సాధారణంగా నిర్లక్ష్యంగా ఖర్చు పెట్టేస్తుందని యువతపై ఓ అభిప్రాయం ఉంది. కానీ జెన్ జెడ్ తరం ఆర్థిక అలవాట్లు లోతుగా చూస్తే ఆశ్చర్యపరుస్తాయి. ఆర్థిక సంక్షోభాలు, కరోనా సమయంలో అనిశ్చితి, టెక్ రంగంలో ఉద్యోగాల కోతల్లాంటివన్నీ చూసిన మీదట ఈ తరం వాళ్లలో చాలా మంది ఖర్చులను అదుపులో ఉంచుకునేందుకు సంప్రదాయ క్రెడిట్ కార్డులకు బ దులు డెబిట్ కార్డుల వాడకానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. దీనితో సంప్రదాయ క్రెడిట్ కార్డ్ కంపెనీలకి ఈ సెగ్మెంట్లో అంతగా పట్టు లభించటం లేదు. కానీ కొత్తరూట్లో "బై నౌ, పే లేటర్" (బీఎన్‌పీఎల్) పేరిట సరికొత్త క్రెడిట్ సర్వీసులు తెచ్చేసరికి జెన్ జెడ్ ఇట్టే ఆకర్షితులయిపోతున్నారు. ఈ-- కామర్స్, ఫిన్‌టెక్ ప్లాట్‌ఫాంలతో నేరుగా అనుసంధానమైన ఈ తరహా స్వల్పకాలిక ఫైనాన్సింగ్ ను యువతరం ఎక్కువగా ఉపయోగించుకుంటన్నా రు. దీనికి పలు కారణాలు ఉన్నాయి.

### అవేంటంటే..

**చాలా తక్కువ డాక్యుమెంటేషన్, అప్పటికప్పుడు అప్రూవల్**

**వార్షిక ఫీజులు లేకపోవడం, వడ్డీరహిత గ్రేస్ పీరియడ్**

**చిన్న చిన్న మొత్తాల్లో సరళంగా చెల్లించే వెసులుబాటు**

కాకపోతే, బీఎన్‌పీఎల్ అనేది చాలా సౌకర్యవంతమైనదే కానీ రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది. వివిధ యాప్‌ల ద్వారా దాదాపు ఒకే వ్యవధిలో చేసే చిన్న చిన్న కొనుగోళ్లన్నీ ఒకేసారి తడిసి మోపెడై, అప్పుడప్పుడే ఆదాయార్జనలో పడిన యువతకు భారీ రుణ భారంగా మారుతున్నాయి కూడా. ఈ ప్రమాదాన్ని ఊహించాలన్నది ఆర్థిక నిపుణుల సూచన.

### ఫిన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం..

యువతరం ఇప్పుడు ఆర్థిక సలహాల కోసం ఇంట్లో పెద్దవాళ్లనో, బ్యాంకు మేనేజర్లనో, చార్టర్డ్ అకౌంటెంట్లనో సంప్రదించడం తగ్గుతోంది. ఎక్కువగా ఫిన్‌ఫ్లుయెన్సర్ల వైపు మళ్లే ధోరణి పెరుగుతోంది. పాత తరం వాళ్లు ఆర్థిక సలహాల కోసం తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, బ్యాంకు మేనేజర్లు, ప్రొఫెషనల్ ఫైనాన్షియల్ అడ్వైజర్లు, న్యూస్ పేపర్లు.. ప్రింట్ మీడియా, ఫిక్స్‌డ్ డిపాజిట్లవైపు చూసేవారు. కానీ జెన్ జడ్ మాత్రం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఇంటిగ్రేటెడ్ ఫిన్‌టెక్ యాప్‌లు, యూట్యూబ్ పాడ్‌కాస్ట్‌లు, ఆన్‌లైన్ కమ్యూనిటీలు (రెడిట్, డిస్కార్డ్), ఆధునిక డిజిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫాంల వైపు చూస్తున్నారు. అన్ని చోట్లా సమాచారం అందుబాటులో ఉండటం వల్ల చిన్న వయస్సు నుంచే ఆర్థిక అక్షరాస్యత మెరుగ్గా ఉంటున్నప్పటికీ, తప్పుడు సమాచారం కూడా భారీగానే వ్యాప్తి చెందుతోంది. వీటివల్ల దెబ్బతింటున్నవాళ్లూ పెరుగుతున్నారు. దీంతో అడ్డూ అదుపూ లేకుండా ఫిన్‌ఫ్లుయెన్సర్లు విస్తరిస్తుండటంపై ప్రపంచవ్యాప్తంగా నియంత్రణ సంస్థలు నిశితంగా దృష్టి పెడుతున్నాయి. తప్పుల తడకల ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ సలహాలను కట్టడి చేయడంపై కసరత్తు చేస్తున్నాయి.

### ముందు నుంచే పెట్టుబడులు..

డిజిటల్ వల్ల కలిగిన ప్రయోజనమేంటంటే... తమ పేరెంట్స్‌తో పోలిస్తే జెన్ జెడ్ చాలా ముందు నుంచే పెట్టుబడుల వైపు మళ్లుతున్నారు. దాదాపుగా అవరోధాలేమీ లేకపోవడంతో నెలకు రూ.100 నుంచి 500 వరకు ఉండే మైక్రో సిప్‌ల (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు) రూపంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. వీరి పోర్ట్‌ఫోలియో చాలా వైవిధ్యంగా ఉంటోంది. మ్యుచువల్ ఫండ్స్, ఈటీఎఫ్‌లు, డైరెక్ట్ ఈక్విటీలు, డిజిటల్ గోల్డ్, సావరీన్ గోల్డ్ బాండ్లు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (రీట్స్) వంటివి ఈ పోర్ట్‌ఫోలియోలో ఉంటునాయి. ఇలా సాధ్యమైనంత ముందు నుంచే ఇన్వెస్ట్‌మెంట్ చేసే ఈ జనరేషన్ వాళ్లు... వెల్త్ మేనేజర్లకు బంగారు గనుల్లా మారుతున్నారు. ఓ ఇన్వెస్టరును 22 ఏళ్ల వయసులో పట్టుకుంటే ఆ తర్వాత బోలెడన్ని సంవత్సరాల పాటు వారు క్లయింట్లుగా కొనసాగే అవకాశం ఉండటమే దీనిక్కారణం. అయితే, ఆర్థిక సంస్థలు ఇందుకోసం తమ మార్కెటింగ్ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటోంది.

జెన్ జెడ్ డిస్కౌంట్లు.. లాయల్టీ పాయింట్ల కన్నా ఎక్కువగా చార్జీల విషయంలో పారదర్శకత, నైతికతతో కూడుకున్న వ్యాపార విధానాలు, డేటా ప్రైవసీకి ప్రాధాన్యమిస్తున్నారు.

### హెచ్చరిక సంకేతాలు..

జెన్ జెడ్‌కి డిజిటల్ ఐక్యూ ఎక్కువే అయినా... కొన్ని విశిష్టమైన సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంటోందని అనలిస్టులు హెచ్చరిస్తున్నారు.

మితిమీరిన లైఫ్‌స్టయిల్ ఖర్చులు: వేగంగా ఆదాయాలు పెరుగుతున్నప్పటికీ, వాటికి తగ్గట్లు లైఫ్‌స్టయిల్‌ని అప్‌గ్రేడ్ చేసుకుంటూ పోవడం వల్ల ఖర్చులు మితిమీరిపోతున్నాయి. ఫలితంగా, ఆదాయాలను దీర్ఘకాలిక పొదుపు వైపు మళ్లించలేని పరిస్థితి ఏర్పడుతోంది.

సబ్‌స్క్రిప్షన్లతో చిల్లు: నెలవారీగా కట్టే డజన్ల కొద్దీ డిజిటల్ సబ్?రస్క్రిప్షన్ల వల్ల చిన్న, చిన్నగా పర్సుకు చిల్లులు పడుతున్నాయి.

సోషల్ మీడియా ఒత్తిడి: ప్రతిదాన్నీ డిజిటల్‌గా పోల్చి చూసుకునే సంస్కృతి వల్ల ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్), (ఇప్పుడు దొరకపుచ్చుకోకపోతే ఇంకెప్పటికీ దొరకదేమో అన్న భయం) వల్ల ఖరీదైన ఎక్స్‌పీరియన్స్‌లు, లగ్జరీ ఉత్పత్తులను కొనుక్కునే ధోరణి పెరుగుతోంది.

ఎమర్జెన్సీ నిధుల కొరత: అప్పటికప్పుడు సంతృప్తి కలిగించే ఎక్స్‌పీరియన్స్‌లకు ప్రాధాన్యం ఇస్తూ, ఆర్థిక భద్రతను పక్కన పెడుతుండటం వల్ల, ఆదాయంపరంగా అనూహ్యమైన షాక్‌లేవైనా తగిలితే తట్టుకునే పరిస్థితి ఉండటం లేదు.

### గెలుపు గుర్రాలు..

జెన్ జెడ్ తెచ్చిన ఆర్థిక విప్లవమనేది దేశీ మార్కెట్ వ్యవస్థలో కొత్త మార్పులకు ఆజ్యం పోసింది. ఈ భారీ డెమొగ్రఫిక్ మార్పులతో ప్రభావితమయ్యే సంస్థల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఇన్వెస్టర్లు ప్రయోజనం పొందవచ్చు. అవేమిటంటే ...

ఫిన్‌టెక్, వెల్త్ టెక్ ప్లాట్‌ఫామ్స్: డిజిటల్ చెల్లింపులు, ఫ్రాక్షనల్ ఇన్వెస్టింగ్, మైక్రో రుణాలిచ్చే కంపెనీలు

ప్రైవేట్ బ్యాంకులు: పటిష్టమైన, అధునాతన డిజిటల్ బ్యాంకింగ్ సదుపాయాలు అందించేవి.

ఫైనాన్షియల్ సూపర్ యాప్స్: పేమెంట్స్, బ్యాంకింగ్, ఇన్వెస్ట్‌మెంట్స్, బీమాను ఒకే ఇంటర్‌ఫేస్‌లో అందించేవి.

అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు: భారీ స్థాయిలో సిప్ రూపంలో రిటైల్ పెట్టుబడులను అందుకుంటున్న మ్యూచువల్ ఫండ్ సంస్థలు.

ఇలా, డిజిటల్‌గా ఆర్థిక సేవలను అందించే, తద్వారా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోగలిగే ఆర్థిక సంస్థలే భవిష్యత్తులో ముందుకు దూసుకెళ్లగలవు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .